
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 23 | సంచిక : 129 | ది.26-7-2024 | విజయవాడ | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## సీఎం చంద్రబాబు అధ్యక్షతన ముగిసిన ఏపీ క్యాబినెట్ సమావేశం

**అమరావతి,జూలై 25 (వార్తాప్రభ) :** సీఎం చంద్రబాబు శాంతిభద్రతలపై శ్వేతపత్రం ప్రవేశపెట్టిన అనంతరం ఏపీ అసెంబ్లీ రేపటికి వాయిదా పడింది. అనంతరం సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ సమావేశం జరిగింది. సచివాలయంలో జరిగిన ఈ క్యాబినెట్ సమావేశానికి మంత్రులు, అధికారులు హాజరయ్యారు. కేంద్ర బడ్జెట్లో ఏపీకి కేటాయింపులు, పోలవరం ప్రాజెక్టుపై ప్రధానంగా చర్చ జరిగింది. పోలవరంపై నిపుణుల కమిటీ నివేదికలోని అంశాలపై క్యాబినెట్ సమాలోచనలు జరిపింది. నివేదికలో నిపుణులు పేర్కొన్న అంశాలను ఈ నెల 27న ఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశంలో కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. రేపు విడుదల చేయనున్న ఆర్థిక శాఖ శ్వేతపత్రం అంశాలు కూడా నేటి క్యాబినెట్ సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు తెలుస్తోంది.

# నేర రహిత రాష్ట్రమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## అసెంబ్లీలో శాంతి భద్రతలపై శ్వేత పత్రం విడుదల చేసిన సీఎం

- గత ప్రభుత్వంలో దెబ్బతిన్న శాంతి భద్రతలను మళ్లీ గాడిన పెడతాం
- ప్రజల ప్రాణాలకు రక్షణ ఇస్తాం... ప్రజల ఆస్తులకు భరోసా ఇస్తాం
- శాంతి భద్రతలకు విఘాతం కలిగితే ఏ స్థాయి వ్యక్తినైనా శిక్షిస్తాం
- నేరస్తుడే పార్టీ అధినేతగా, ముఖ్యమంత్రిగా ఉంటే ఏం జరుగుతుందో గత ఐదేళ్లు అదే జరిగింది
- ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీలు 250 మంది, మహిళలు 2,027 మంది దారుణ హత్యకు గురయ్యారు
- ఇప్పుడు నీ ఇంట్లో కూడా ప్రభుత్వ ఫర్నిచర్ ఉంది ఏం సమాధానం చెప్తారు?
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- రాష్ట్రంలో జరిగిన దారుణాలపై గత ఐదేళ్ల తన ఆవేదన ఆవిష్కృతం చేసేలా సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం
- చంద్రయ్య, అబ్దుల్ సలాం, మాజీ స్పీకర్ కోడెల వంటి వారి గురించి చెపుతూ ఉద్వేగానికి లోనైన సీఎం
- జగన్ అక్రమార్జన కోసం కొలంబియా క్రిమినల్ పాబ్లో ఎస్కోబార్ లా వ్యవహరించాడని పోల్చిన చంద్రబాబు
- జీరో టాలరెన్స్ ఆన్ క్రైం అనేది తమ విధానమని ప్రకటించిన సీఎం



రాష్ట్రంలో పూర్తిగా దెబ్బతిన్న శాంతి భద్రతలను మళ్లీ గాడిలో పెడతామని, నేర రహిత సమాజమే లక్ష్యంగా అడుగులు వేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమున్నా మొదట చేయాల్సింది ప్రజల ప్రాణాలు కాపాడి వారి ఆస్తులకు భరోసా ఇవ్వాలని, కానీ గడిచిన ఐదేళ్ల పాటు శాంతి భద్రతలను గాలికొదిలేశారని అన్నారు. శాసనసభలో గురువారం శాంతిభద్రతలపై శ్వేతపత్రం విడుదల చేశారు. రాష్ట్రంలో జరిగిన దారుణాలపై గత ఐదేళ్ల తన ఆవేదన ఆవిష్కృతం చేసేలా సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...."దేశంలోనే ఏపీ పోలీసులకు ఒక ప్రత్యేకత ఉంది. సమైఖ్య రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా సమర్థవంతంగా నడిపించాం. ఒకప్పుడు రాయలసీమలో ఫ్యాక్షనిజం ఉండేది...ఫ్యాక్షన్ ను అణచివేడయడానికి సమర్థవంతమైన అధికారులను నియమించాం.

**అమరావతి,జూలై 25 (వార్తాప్రభ) :** సీమలో ఫ్యాక్షన్ లేకుండా చేయాలన్న సంకల్పంతో పని చేశాం. రాజకీయంగా వేధిస్తున్నారన్న మాట కూడా రాకుండా ఉండేందుకు మొదట మా ఎమ్మెల్యేలను అరెస్టు చేసిన తర్వాత మిగతావారిని అరెస్టు చేశాం. తర్వాత ఆ ప్రాంతం అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. హైదరాబాద్ లో ఆరు నెలలు పాటు కర్ఫ్యూ ఉండేది. కనీసం నిత్యావసర వస్తువులు కూడా దొరకేవి కాదు. కానీ మత ఘర్షణలపై ఉక్కుపాదం మోపాం. తర్వాత పెట్టుబడులు వచ్చాయి..ఉపాధికి నెలవుగా మారింది. నక్సలిజాన్ని ఎదుర్కొనేందుకు సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యూహాలు రచించాం. నాపై బాంబు దాడి చేసినా భయపడలేదు. రౌడీ అనే పేరు వినబడటానికే భయపడేలా పీడీ యాక్ట్ పెట్టి అణచివేశాం." అని తెలిపారు.

**నాడు మేం తీసుకున్న చర్యలతో అదుపులో నేరాలు..** "2014-19 మధ్య శాంతి భద్రతలను కాపాడటం కోసం తీసుకున్న చర్యల వల్ల హత్యలు 15 శాతం, అల్లర్లు 51 శాతం, కిడ్నాప్ లు 16 శాత తగ్గాయి. దాడులు 20 శాతం, వేధింపులు 11 శాతం, దోపిడీలు 25 శాతం తగ్గించాం. ప్రభుత్వ చర్యలతో ప్రజల భద్రతను పెంచడంతో ప్రతి ఒక్కరిలో నమ్మకం వచ్చింది. ఇవి సాధించడానికి సాంకేతికతను ఉపయోగించాం. విభజన తర్వాత మోడల్ డీజీపీ ఆఫీసును నిర్మించాం. రాష్ట్రంలో 14,770 ఆటోమేటిక్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. పోలీసులకు బాడీ ఓర్న్ కెమెరాలు అమర్చి దూషణలు, పరుషంగా ఎవరు మాట్లాడినా చర్యలు తీసుకున్నాం. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడితే వాటినుండి అలెర్ట్ చేయడానికి కెమెరాలు ఏర్పాటు చేశాం. ఆటోమేటిక్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ విధానాన్ని తీసుకొచ్చి నేరాలు తగ్గించాం. కానీ 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం చీకటి పాలనను తలపించింది. ఎమర్జెన్సీలో కూడా లేనంతగా అందరినీ ఇబ్బందులు పెట్టారు. ప్రజాస్వామ్య పునాదులపై దాడులు చేశారు. శాసన వ్యవస్థ, కార్య నిర్వహణ వ్యవస్థ, న్యాయ వ్యవస్థలపైనా, మీడియాపైనా దాడులు చేశారు. ఇదే సభలో గత ప్రభుత్వంలో దూషణలు చేయడంతో పాటు సభ్యులపై దాడులకు పాల్పడ్డారు. నన్ను కూడా అవమానించడంతో సభ నుండి నిష్క్రమించి గౌరవ సభగా మార్చిన తర్వాతే వస్తానని చెప్పాను. అందుకే మళ్లీ గౌరవసభకు ముఖ్యమంత్రిగా వచ్చా. మండలికి 3 రాజధానుల బిల్లు పంపినప్పుడు ఛైర్మన్ పై మాటల దాడి చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. ప్రభుత్వ కక్షసాధింపులకు పోలీసులను ఆయుధంగా మార్చుకున్నారు. వైసీపీ నేతలతో కుమ్మక్కైన వారికి నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగులు ఇచ్చారు. వైసీపీ నేతల అక్రమాలకు సహకరించని వారిని సుదీర్ఘకాలం వీఆర్ కు పంపారు. వారి దుర్మార్గాలపై విభేదిస్తే పోస్టింగులు ఇవ్వకుండా వేధించారు. ఐదేళ్లపాటు వీఆర్ లో ఉన్న కొందరు అధికారులను గత ప్రభుత్వంలో మనం చూశాం. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను విధ్వంసం చేశారు." అని సీఎం అన్నారు.

**ఒక్క కేసు కూడా లేని నాపై కక్షతో 17 కేసులు పెట్టారు..** "ప్రజాస్వామ్యానికి పునాది రాజకీయ పార్టీలు, నాయకులు. చిన్న పార్టీని కూడా విమర్శించాలన్నా, చిన్న నాయకుడిపై దాడి చేయాలన్నా గతంలో భయపడేవారు. గత ఐదేళ్లలో నాపై 17 కేసులు పెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజల కోసం బాబ్లీ ప్రాజెక్టు వద్ద ఆందోళన చేయడానికి వెళ్లినప్పుడు తప్ప నాపై ఒక్క కేసు కూడా లేదు. అలాంటిది 2019లో అధికారంలోకి రాగానే నా ఇంటిపై డ్రోన్ ఎగురవేశారు. ఛలో ఆత్మకూరుకు పిలుపునిస్తే ఇంటిగేటుకు తాళ్లు కట్టారు. పవన్ కల్యాణ్ పై 7 కేసులు పెట్టారు. నోటీసులు ఇచ్చి విశాఖపట్నం నుండి బలవంతంగా పంపేశారు. నన్ను అరెస్టు చేసిన సమయంలో రాష్ట్రానికి వస్తుంటే రానివ్వకుండా సరిహద్దులో అడ్డుకున్నారు. దీంతో ఆయన రోడ్డుపైనే పడుకుని నిరసన తెలిపారు. మాచర్లలో టీడీపీ అభ్యర్థులను నామినేషన్ వేయనివ్వకుండా ఇబ్బందులు పెడుతుంటే బోండా ఉమా, బుద్ధా వెంకన్న వెళ్లారు...వారిపై దాడి చేస్తే తప్పించుకుని వచ్చారు. యువగళం పాదయాత్రలో లోకేష్ కు మైకు ఇవ్వకుండా, బెంచి ఎక్కనివ్వకుండా ఇబ్బందులు పెట్టారు. పాదయాత్ర సాగనివ్వకుండా ఉండేందుకు రాజమండ్రి వద్ద గోదావరి బ్రిడ్జి మూసేశారు. పల్లా శ్రీనివాస్ రావుకు చెందిన బిల్డింగును అక్రమంగా కూల్చేశారు. అందుకే ప్రజలు ఆదరించి పల్లా శ్రీనివాసరావుకు 95 వేల మెజారిటీ ఇచ్చారు. వ్యాపారాన్ని దెబ్బతీయడానికి ఆదిరెడ్డి అప్పారావు, శ్రీనివాస్ లను అరెస్టు చేశారు. ధూళిపాళ్ల నరేంద్రపై కేసులు పెట్టి జైల్లో పెట్టారు. ప్రభుత్వ అధికారులపై దాడులు చేశారని కూన రవికుమార్ పై కేసులు పెట్టారు. గౌతు శిరీష, పంచుమర్తి అనురాధపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టారు." అని సీఎం

# తెలంగాణ బడ్జెట్: రూ.2,91,159 కోట్లు

## రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ

- జాబ్ క్యాలెండర్ త్వరలో ప్రకటిస్తామన్న ఉపముఖ్యమంత్రి
- ఆరోగ్యశ్రీ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడి
- బీఆర్ఎస్ హయాంలో అప్పులు 10 రెట్లు పెరిగాయన్న భట్టివిక్రమార్క
- ఈ ఏడాది రూ.57,112 కోట్ల అప్పులు తీసుకోవాలని నిర్ణయం
- అప్పులు పదేళ్లలో రూ.75,577 కోట్ల నుంచి రూ.6,71,751 కోట్లకు పెరిగినట్లు వెల్లడి
- శాసన సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క

**హైదరాబాద్,జూలై 25 (వార్తాప్రభ) :** తెలంగాణ అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ఆరోగ్యశ్రీకి ఇచ్చే మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. గత ప్రభుత్వం పెద్ద ఎత్తున అప్పులు చేసిందని, రాష్ట్రం ఆర్థికంగా క్లిష్టపరిస్థితుల్లో ఉందన్నారు. అయినప్పటికీ సంక్షేమం, అభివృద్ధి ఆపడం లేదన్నారు. రూ.2 లక్షల రుణం ఉన్న రైతులకు త్వరలో మాఫీ చేస్తామన్నారు. రుణమాఫీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే శిలాశాసనమే అన్నారు. రైతులు పండించే సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు అవసరమైన సాయం అందిస్తామన్నారు. త్వరలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించామన్నారు. రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలన్నది తమ లక్ష్యమన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పులపాలైందన్నారు. పదేళ్లలో అప్పులు పదిరెట్లు పెరిగాయని పేర్కొన్నారు. అప్పులు వామనావతారం లెక్క పెరిగాయన్నారు. అధికారంలోకి వస్తే బంగారు తెలంగాణ చేస్తామని ప్రగల్భాలు పలికి అప్పులపాలు చేశారన్నారు. ఓ వైపు అప్పులు పెరిగిపోగా... మరోవైపు బిల్లులు, బకాయిలు పెరిగిపోయాయన్నారు. గత పదేళ్ల అస్తవ్యస్త పాలనకు తెలంగాణ ప్రజలు ఎన్నికల్లో చరమగీతం పాడారన్నారు. దశాబ్దకాలంలో తెలంగాణ పురోగమించలేదన్నారు. ఒంటెత్తు పోకడలతో ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. జీతాలు, పెన్షన్ల చెల్లింపులు కూడా చెల్లించలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి చాలా క్లిష్టంగా ఉందన్నారు. దుబారా ఖర్చు ఆపేసి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామన్నారు. ప్రతి నెల 1వ తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ఆపడం లేదన్నారు.



**ఏ పథకానికి ఎంత?** రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం: రూ.723 కోట్లు గృహజ్యోతి పథకం: రూ.2,418 కోట్లు ఉద్యానవనం: రూ.737 కోట్లు పశుసంవర్ధక శాఖ: రూ.1,980 కోట్లు విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణ: రూ.100 కోట్లు హైదరాబాద్ నగర అభివృద్ధి: రూ.10 వేల కోట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు: రూ.500 కోట్లు మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు: రూ.1500 కోట్లు ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు: రూ.1525 కోట్లు మల్టీ మోడల్ సబర్బన్ రైల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్: రూ.50 కోట్లు ఔటర్ రింగ్ రోడ్డు: రూ.200 కోట్లు మెట్రో వాటర్ వర్క్స్: రూ.3,385 కోట్లు హైడ్రా: రూ.200 కోట్లు జీహెచ్ఎంసీలో మౌలిక వసతుల కల్పన: రూ.3,065 కోట్లు హెచ్ఎండీఏలో మౌలిక వసతుల కల్పన: రూ.500 కోట్లు ప్రజాపంపిణీ: రూ.3,836 కోట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి: రూ.29,816 కోట్లు బీసీ సంక్షేమం: రూ.9,200 కోట్లు వైద్యం, ఆరోగ్యం: రూ.11,468 కోట్లు ట్రాన్స్‌కో, డిస్కంలు: రూ.16,410 కోట్లు అడవులు, పర్యావరణం: రూ.1,064 కోట్లు ఎస్టీ సంక్షేమం: రూ.17,056 కోట్లు మైనార్టీ సంక్షేమం: రూ.3,003 కోట్లు స్త్రీ, శిశు సంక్షేమం: రూ.2,736 కోట్లు ఎస్సీ సంక్షేమం: రూ.33,124 కోట్లు ఐటీ రంగం: రూ.774 కోట్లు నీటి పారుదల శాఖ: రూ.22,301 కోట్లు ఆర్ అండ్ బీ: రూ.5,790 కోట్లు పరిశ్రమల శాఖ: రూ.2,762 కోట్లు విద్యారంగం: రూ.21,292 హోంశాఖ: రూ.9,564 కోట్లు వ్యవసాయం: రూ.72,659 కోట్లు ఇందిరా మహిళా శక్తి పథకం: రూ.50.41 కోట్లు

# చేనేత ఎగ్జిబిషన్ కు పకడ్బందీ ఏర్పాట్లు

- రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

**విజయవాడ,జూలై 25 (వార్తాప్రభ) :** వచ్చే నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే చేనేత ఎగ్జిబిషన్ కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, సౌకర్యాల కల్పనలో అలక్ష్యం చేయొద్దని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు సందర్భంగా... నగరంలోని మేరీస్ స్టెలా కాలేజీ, ఏ ప్లస్ కన్వన్షన్ సెంటర్ ను గురువారం ఆమె పరిశీలించారు. ముందుగా మేరీస్ స్టెల్లా కాలేజీని పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని చేనేత శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్ ను పరిశీలించారు. సీఎం చంద్రబాబునాయుడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించే చేనేత ఎగ్జిబిషన్లను ప్రారంభించే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సహా పలువురు మంత్రులు పాల్గొనే అవకాశముందన్నారు. అతిథుల కార్ల పార్కింగ్, చేనేత కార్మికులు, సందర్శకులకు సౌకర్యాల కల్పనపై ప్రధాన దృష్టి సారించాలని స్పష్టం చేశారు. చేనేత కార్మికులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించే అవకాశముందని, ఇందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల ఏడో తేదీ నుంచి పది రోజుల పాటు జరిగే చేనేత ఎగ్జిబిషన్లను ప్రజలు సందర్శించేలా విస్తృతమైన ప్రచారం కల్పించాలన్నారు. చేనేత కార్మికుల్లో అవగాహన కల్పించి, ఈ చేనేత ఎగ్జిబిషన్ లో అత్యధిక స్టాళ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ స్టాళ్లలో చీరలు, ఇతర చేనేత వస్త్రాల విక్రయాల ద్వారా చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగే అవకాశముందన్నారు. ప్రస్తుతం ఎంత మంది స్టాళ్ల ఏర్పాటుకు ముందుకొచ్చారని మంత్రి ఆరా తీశారు. 80 స్టాళ్ల ఏర్పాటు చేసే అవకాశముందని, ఇందుకోసం 300ల మంది చేనేత కార్మికులు రానున్నారని మంత్రికి అధికారులు వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, స్టాళ్ల ఏర్పాటుకు వచ్చే చేనేత కార్మికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎగ్జిబిషన్ లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.



# రక్షణరంగ ఉత్పత్తుల తయారీపై రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్న 'వెమ్ టెక్నాలజీస్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్,జూలై 25 (వార్తాప్రభ) :** రక్షణరంగ పరికరాల ఉత్పత్తి సంస్థ 'వెమ్ టెక్నాలజీస్' మొదటి దశ ప్రాజెక్టులో వెయ్యి కోట్ల పెట్టుబడులు పెడుతోందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. జహీరాబాద్ నిమ్జ్ లో 511 ఎకరాల్లో ఏర్పాటవుతున్న ఈ సమీకృత ఉత్పాదన కేంద్రం వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ట్రయల్ ప్రొడక్షన్ కు సిద్ధమవుతుందని తెలిపారు. మొదటి దశ పూర్తయితే వెయ్యి మందికి ఉద్యోగాలు లభిస్తాయని శ్రీధర్ బాబు వివరించారు. గురువారం నాడు సచివాలయంలో 'వెమ్ ఇండస్ట్రీస్' ప్రతినిధులు మంత్రితో సమావేశమయ్యారు. కేటాయించిన భూమిలో ఇంకా స్వాధీనం చేయాల్సిన 43 ఎకరాలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి శ్రీధర్ బాబు సూచించారు. ఉత్పత్తి ప్రారంభించడానికి అవసరమైన 33 కె.వి విద్యుత్తు లైన్లను నాలుగు నెలల్లో ఏర్పాటు చేసి సరఫరా ప్రారంభించాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు మధ్యలో నుంచి వెళ్తున్న రోడ్లను ప్రత్యామ్నాయ మార్గాల్లో నిర్మించాలని అన్నారు. పాత విద్యుత్తు లైన్లు, ఆప్టిక్ ఫైబర్ కేబుళ్లు, గ్రామీణ మంచినీటి సరఫరా లైన్లను మళ్లించాలని సూచించారు. సమావేశంలో వెమ్ టెక్నాలజీస్ సిఎండీ వి. వెంకటరాజు, సంస్థ ప్రతినిధులు ఆర్ ఎస్ ఎస్ రావు, కె.రంగరాజు, ఆర్.వి.రమణ, డివిఎస్ రాజు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంత్రి, టీజీఐఐసి ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణా ట్రాన్స్ కో డైరెక్టర్ జగత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## పాస్‌పోర్టు కాలిపోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ అర్బన్, ఖుద్దూస్ నగర్, స్టార్ బిల్డింగ్, డోరు.నెం.18-11-26/34రు కాపురస్తురాలు వంగా సతీష్ గారి భార్య వంగా మేరీ అను నేను ది.25-06-2024వ తేదీన మా ఇంట్లో టేబుల్‌పై నా బ్యాగులో నెం. ఎస్6409075, విశాఖపట్నంలో ది. 26-11-2018లో జారీచేయబడిన పాస్‌పోర్టు మరియు ఇతర సర్టిఫికేట్లు పెట్టియుండగా, క్యాండిల్ వెలుగు బ్యాగుపై పడి, బ్యాగుతో సహా కాలిపోయినది. సదరు బ్యాగులో ఉన్న పాసుపోర్టు, ఇతర పత్రాలు కాలిపోయినవని, వాటిని నేను ఏవిధముగానూ ఎటువంటి అన్యాక్రాంతములు జరపలేదని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

సెల్ నెం. 9652867159


# ఉత్తర భారతీయులు దక్షిణాది భాషల అధ్యయనంతోనే జాతీయ సమైక్యత

- హిందీ ప్రాంతీయులకు ఆచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ హితవు

**విజయవాడ, జూలై 25 (వార్తాప్రభ) :** త్రిభాష సూత్రం ఈ దేశానికి శ్రేయస్కరమని, హిందీ ప్రాంతీయులు తప్పనిసరిగా ఏదో ఒక దక్షిణ భారతీయ భాషను నేర్చు కోవాలని అప్పుడే జాతీయ సమైక్యత సాధ్యమని పద్మభూషణ్, విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ అన్నారు. ఆ విధంగా ముందడుగు పడనంత వరకు వారికి దక్షిణాది రాష్ట్రాల వారిని హిందీ నేర్చుకోమనే అర్హత ఉండదని హితవు పలికారు. అరవింద్ ఘోష్ - హిందీ అనే అంశంపై డిల్లీలోని యన్ డి యం సి కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ హిందీ సమ్మేళనంను ఆచార్య యార్లగడ్డ గురువారం ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితులలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం భాషల వారికి హిందీని తమ మీద అనవసరంగా రుద్దుతున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. అయితే ఎవరు ఎన్ని భాషలు నేర్చుకుంటే అది వారికే లాభం తప్ప ఆ భాషకేమి ఒరగదని యార్లగడ్డ వివరించారు. కేంద్ర మంత్రి మేఘవాల్, పార్లమెంటు సభ్యులు సత్యనారాయణ్ జటియా, కె సి త్యాగి, ఆర్ కె సిన్హా అతిథులుగా హాజరయ్యారు. దేశ విదేశాల నుండి 500 మంది ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.



## వార్తాప్రభ - పంచాంగం

**25-7-2024 గురువారం**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం. ఆషాఢమాసం, శుక్లపక్షం

తిథి : పంచమి 01.59 వరకు,

నక్షత్రం : పూర్వాభాద్ర సా.4.16 వరకు

వర్జ్యం : రా.11.42-1.10 వరకు

దుర్ముహూర్తం : 8.19 నుండి 09.10 వరకు

రాహుకాలం : మ. 2.00 - 3.37 వరకు

మంచి సమయం : ప.8.45 నుండి 9.25 వరకు

సూర్యోదయం : 5.41కి

సూర్యాస్తమయం : 6.37కి




వార్తాప్రభ తెలుగు దినపత్రిక

రోజుకు రూ.300/- మాత్రమే

మినిమం 1X6 నెలకు : రూ.1999/-

జూలై 1 నుంచి శుభారంభం

క్లాసిఫైడ్స్

మరిన్ని వివరాలకు :

9347993188, 9666568661

- అమ్మకం
- అద్దెకు
- కంప్యూటర్
- ఫర్నీచర్స్
- స్థలం
- ఆటోమొబైల్స్
- కావలెను
- సర్వీసు


## వార్తాప్రభ - రాశిఫలాలు




12 రాశుల వారు ఎలాంటి పరిహారాలు పాటించాలనే ఆసక్తికరమైన విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం...

**మేష రాశి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు బ్యాంకులో రుణం తీసుకోవాలనే ఆలోచనలో ఉంటే సమయం అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగులకు అధికారుల నుంచి గౌరవం, మద్దతు లభిస్తుంది. మీరు ఈరోజు పాత స్నేహితులను కలుస్తారు. ఇది మిమ్మల్ని సంతోషపరుస్తుంది.

**వృషభ రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు చాలా బిజీగా గడుపుతారు. మానసిక, శారీరక శ్రమ కారణంగా మీకు అలసిపోయినట్లు అనిపించొచ్చు. మీరు చాలా కష్టపడాల్సి ఉంటుంది. అప్పుడే మీరు అన్ని పనుల్లో విజయం సాధించొచ్చు. ఈరోజు మీ నిర్ణయం తీసుకునే సామర్థ్యం నుండి ప్రయోజనం పొందొచ్చు.

**మిధున రాశి వారి ఫలితాలు..** ఈరోజు శుక్రాదిత్య ప్రభావంతో ఈ రాశి వారికి ఆర్థిక పరంగా మెరుగైన ఫలితాలు రానున్నాయి. మీ ఆదాయం పెరిగే అవకాశం ఉంది. మరోవైపు ఉద్యోగులు ఈరోజు శత్రువుల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే వారు మీకు హాని కలిగించడానికి ప్రయత్నించొచ్చు.

**కర్కాటక రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు లక్ష్మీదేవి అనుగ్రహం కలగనుంది. వ్యాపారులు చాలా కాలంగా చేసిన కష్టానికి తగిన ఫలితాలు పొందే అవకాశం ఉంది. మీ పిల్లల గురించి మీరు శుభవార్తలు వింటారు. మీ తల్లి నుండి కూడా ప్రేమ, ఆప్యాయతలను పొందుతారు.

**సింహ రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు బంధువుల నుంచి కొన్ని శుభవార్తలు వింటారు. మీ కోపాన్ని నియంత్రించుకోవాలి. మధురమైన పదాలను ఉపయోగించాల్సి ఉంటుంది. లేకపోతే సంబంధాలలో చీలికలు వస్తాయి. మీకు కంటి సంబంధిత సమస్య ఏదైనా ఉంటే అది ఈరోజు మెరుగుపడుతుంది.

**కన్య రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు తల్లిదండ్రుల నుంచి మద్దతు లభిస్తుంది. అయితే మీ జీవిత భాగస్వామి శారీరక నొప్పిని అనుభవించొచ్చు. మీ సమస్యలు కూడా పెరుగుతాయి. వ్యాపారం చేసే వ్యక్తులు ఈరోజు కొన్ని కొత్త ఆర్డర్లను పొందుతారు. ఈరోజు మీరు నిర్భయ భావాన్ని కలిగి ఉంటారు.

**తులా రాశి వారి ఫలితాలు ..** ఈ రాశి వారు ఈరోజు హక్కులు, ఆస్తి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మీ పిల్లలు, మీ జీవిత భాగస్వామి ఇద్దరూ సంతోషంగా ఉంటారు. మీ-రు స్నేహితుడి నుండి కూడా సహాయం పొందొచ్చు. మీరు ఈరోజు ఏదైనా కొత్త పనిలో పెట్టుబడి పెట్టాలనుకుంటే అది శుభప్రదంగా ఉంటుంది.

**వృశ్చిక రాశి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు కొన్ని కారణాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటారు. వ్యాపారులు మంచి లాభాలను పొందే అవకాశం ఉంది. దీంతో మీ ఆర్థిక పరిస్థితి బలోపేతం అవుతుంది. మీరు చేసే పనుల్లో మంచి విజయం సాధించే అవకాశం ఉంది.

**ధనస్సు రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు ఆరోగ్య పరంగా కొన్ని సమస్యలను ఎదుర్కొంటారు. మీ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఈరోజు మీరు కడుపు నొప్పి, గ్యాస్‌తో బాధపడొచ్చు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. మీ ఆహారపు అలవాట్లను నియంత్రించాలి.

**మకర రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు కొన్ని అనవసరమైన ఖర్చులను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. మీరు కోరుకోకపోయినా బలవంతంగా చేయాల్సి ఉంటుంది. ఈరోజు మీరు చాలా విషయాల్లో తల్లిదండ్రుల మద్దతు పొందుతారు. మీ జీవిత భాగస్వామి నుండి కూడా పూర్తి మద్దతు పొందుతారు.

**కుంభ రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు తాము చేసే పనిలో మంచి విజయం సాధిస్తారు. అయితే మీరు శత్రువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అయితే భయపడాల్సిన అవసరం లేదు. వారు మీకు ఎటువంటి హాని చేయలేరు. మీ ఆదాయం పరిమితంగా ఉంటుంది.

**మీన రాశి వారి ఫలితాలు ..** ఈ రాశి వారికి ఈరోజు కుటుంబ జీవితంలో ఏదైనా గొడవ జరిగితే పరిష్కారమయ్యే అవకాశం ఉంది. మీరు ఈరోజు సాయంత్రం స్నేహితులతో సరదాగా గడుపుతారు. ఈరోజు మీరు సామాజిక గౌరవాన్ని పొందే అవకాశం ఉంది. ఇది మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.


పోతిన కుమార్

సెల్ : 6300148993 9014094388

విజయ మిల్క్ పార్లర్

కుమార్ మిల్క్

విన్నకోటవారి చౌక్, విజయవాడ-1

మా వద్ద విజయవారి పాలు, పాల పదార్థములు ఆర్డరుపై సప్లయి చేయబడును.

డోర్ డెలివరీ సౌకర్యము కూడా కలదు

VIJAYA



Satish : 8019483304 - Ranga : 9247284050

దివ్యసాయి ఎలక్ట్రికల్స్

DIVYASAI ELECTRICALS

WHOLESALE & RETAIL ELECTRICAL GOODS

Opp. Steel Palce, Samarangam Chowk, Main Road, Vijayawada - 520 001

VIHAN GM legrand FINECAB


## గ్రామాల అభివృద్ధికి ఆర్థిక సాయం అందించాలి



**అమలాపురం,జూలై 25 (వార్తాప్రభ) :** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో చమురు సహజవాయుల సంస్థ కార్యక లాపాలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో కార్పొ రేట్ సామాజిక బాధ్యత నిధులతో గ్రామాల అభివృద్ధికి ఇతోదికంగా ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఓఎన్ జీసీ అధికారు లను కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ గారి ఛాంబర్ నందు చమురు సహజ వాయువుల సంస్థ తూర్పు ప్రాంత ఆఫ్ సోర్ ఎసెట్ కాకినాడ ప్రతిని ధులు జిల్లా పంచాయతీ అధికారి సిపిఓలతో సమావేశం నిర్వహించి ఓడల రేవు తదితర ప్రాంతాలలో మూడు క్లస్టర్ల ద్వారా నిర్వహిస్తున్న కార్యకలాపాలను ఓఎన్జీసీ ప్రతిని ధులు జిల్లా కలెక్టరు మహేష్ కుమార్ వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఓఎన్జీసీ అధికారులు ముడి చమురు, గ్యాస్, నీటి విభజన విధానం పైప్ లైన్ భద్రత గోదావరి బేసిన్లో చమురు సహజ వాయువులు డ్రిల్లింగ్ ద్వారా వెలికితీత, డ్రిల్లింగ్ సమయంలో ఆ ప్రాంతంలో చేపల వేట కోల్పోయిన మత్స్య కారులకు జీవ నభృతి అందించడం, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు కేటాయింపు, తదితర అంశాలను విశదీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు విధి విధానాల పరంగా విడుదల చేస్తూ నిక్షేపాలు వినియోగించుకుంటున్న చమురు సంస్థలు ఈ ప్రాంత అభివృద్ధి,మౌలిక సదుపాయాలు కల్పనలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు చము రు, సహజవాయుల సంస్థ (ఓఎన్జిసి) వారి కార్యకలాపాలపై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా పంచాయితీ అధికారి, ఓఎన్జీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి కార్పోరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) నిధులు కేటాయింపు అంశాలపై క్షుణ్ణంగా చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఓఎన్ జీసీ చమురు నిక్షేపాలు వెలికి తీస్తున్న గ్రామాల జాబితాను సిద్ధం చేసి గ్రామాభి వృద్ధికి స్థానిక ప్రజల డిమాండు అంశాలను సమర్పించాలని జిల్లా పంచాయితీ అధికారిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో చమురు సహజ వాయుల సంస్థ ఎస్టేట్ మేనేజరు కార్యనిర్వాహక సంచాలకులు రత్నేస్ కుమార్,సీజీఎం మెకానికల్ నిర్మల్ కుమార్, హెడ్ హెచ్ ఎస్ సి మేనేజర్ భాస్కరరావు,హెచ్ ఆర్ హెడ్ సునీల్ కుమార్,ప్రొడక్షన్ జనరల్ మేనేజర్ గుప్తా, ప్రొడక్షన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మురుగవెల్, సీనియర్ హెచ్ ఆర్ ఎగ్జిక్యూటివ్ సాదా భన్వర్, ఫణీంద్ర నరేంద్ర,సిపిఓ వెంకటేశ్వర్లు జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదాల నివారణపై అవగాహన




**కాకినాడ,జూలై 25 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారి ఉత్తర్వులు మేరకు, కాకినాడ ఎస్డీపీవో డా.కె.హనుమంతరావు పర్యవేక్షణలో కాకినాడ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ, కాకినాడ రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో కాకినాడ పీఆర్ డిగ్రీ కాలేజీ నందు విదార్థిని,విద్యార్థులకు ట్రాఫిక్ -1 ఇన్స్పెక్టర్ ఎన్.రమేష్,ట్రాఫిక్ 2 ఇన్స్పెక్టర్ చైతన్య కృష్ణ,సిబ్బంది, కాకినాడ మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ పానెల్ అడ్వకేట్ డా. సునీల్ కాంత్ కుమార్,కాకినాడ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.మురళీకృష్ణ,కాకినాడ డిస్ట్రిక్ట్ రోడ్డు సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ ఏవి.పద్మావతి,సంయుక్తంగా నిర్వహించిన రోడ్డు సేఫ్టీ ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా, రోడ్డు ప్రమాదాలను నిర్మూలించాలనే ఉద్దేశంతో వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, త్రాగి మితిమీరిన వేగంతో నడపడం వల్ల కలిగే నష్టాలను,ద్విచక్ర వాహనాలకు అమర్చబడిన మోడిఫైడ్ సైలెన్సర్ల వల్ల వచ్చు శబ్దకాలుష్యం వల్ల ప్రజలకు కలుగు ఇబ్బందులను గురించి,టూ వీలర్స్ పై ఇద్దరి కన్నా ఎక్కువ మంది ప్రయాణించరాదనే విషయాల గురించి వారికీ తెలియపరచి వారిలో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యకమంలో భాగముగా పీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం విద్యార్థిని,విద్యార్థులందరికి ట్రాఫిక్ పట్ల అవగ హన ఉండాలనే ఉద్దేశముతో ట్రాఫిక్ సంబంధించి పరీక్ష నిర్వహించి వారికీ బహుమతులు ఇవ్వడమే కాకుండా ఇంటర్నల్ నందు 2 మర్క్స్ కలుపుతాము హామీ ఇచ్చినారు.పీఆర్ కాలేజీకి బైక్ పై వచ్చు స్టూడెంట్స్ కి డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా కలిగి ఉండలని,పీఆర్ కాలేజ్ కి బైక్ పై వచ్చు అందరు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలనే ఉద్దేశంతో, హెల్మెట్ లేనివారికీ కొనుగులు నిమిత్తం ప్రతి ఒక్కరికి కాలేజీ తరపున రూ.200లు ఇస్తామని హామీఇవ్వడమైనది. తదుపరి హెల్మెట్ పట్ల అవగాహనపై తమ పీఆర్ కాలేజీ నందు ఉండే ఎన్సీసీ వారి సహాయంతో పట్టణాలలోని, గ్రామాలలోని అవగాహనా కల్పిస్తాము అని చెప్పియున్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల్లో డ్రగ్స్ ను అరికట్టేందుకు ప్రహారీ క్లబ్ లు ఏర్పాటు - కేసలి అప్పారావు



**మంగళగిరి,జూలై 25 (వార్తాప్రభ) :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పాఠశా లల్లో ,కళాశాలల్లో మరియు వసతి గృహాల్లో డ్రగ్స్ వినియోగం,విక్రయంని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు ప్రహారీ క్లబ్ లు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మరియు విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ ఏం.ఆర్ .ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ రోజు రాష్ట్రం లోని అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ లు మరియు విద్యాశాఖ సిబ్బంది తో విద్యాసంస్థలు లో ప్రహారీ క్లబ్ లు ఏర్పాటు గురుంచి జూమ్ మీటింగ్ ఏర్పాటు చేసి చేపడుతున్న కార్యక్రమాలు గురుంచి చర్చించడం జరిగింది. విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల వాడకాన్ని నిరోధించేందుకు ఉన్నత పాఠశాలల్లో ప్రహారీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్రగ్స్ వినియోగం, అమ్మకాలపై ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తుందనీ, అక్రమంగా డ్రగ్స్ సరఫరా చేసే వారిపై ఉక్కు పాదం మోపి కఠిన చర్యలకు ఉపక్రమిస్తుందనీ తెలిపారు. మత్తుపదార్థాలను,మాదక ద్రవ్యాలు , పొగ త్రాగడం ,ఆల్కహాల్ తీసుకోవడం వలన విద్యార్థులు ,యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అందులో భాగంగా స్కూల్, కాలేజీల్లో డ్రగ్స్ వినియోగంపై రాష్ట్రంలో అన్ని శాఖల అధికారులు సమన్వయం తో అవగాహన కల్పించడం,ప్రచారం చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులపై శాఖాపరమైన చర్యలుకు ప్రభుత్వం వెనకాడటం లేదనీ,తాజాగా స్కూల్ పిల్లలు డ్రగ్స్? బారిన పడకుండా ఉండేందుకు కొత్త తరహా ప్రణాళికలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందనీ తెలిపారు. డ్రగ్స్ ను వినియోగించకుండా, వాటిని పాఠశాల చుట్టుపక్కల ఎవరూ విక్రయించకుండా ఈ ప్రహారీ క్లబ్‌లు పటిష్ఠ చర్యలు తీసుకొనున్నాయనీ. డ్రగ్స్‌పై విద్యార్థుల్లో అవగాహన పెంచడంతోపాటు నిరంతరం నిఘా వేసి పర్యవేక్షణ లో ఉంచుతాయని తెలిపారు. ప్రహారీ క్లబ్‌లు పనిచేసే విధానంపై జాతీయ బాలల హక్కుల కమిషన్ వారు ఆదేశాలు, మార్గదర్శకాలతో మరింత బలోపేతం చేస్తున్నట్లు వ విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు వాసిరెడ్డి విజయ దుర్గ, ఏ.సుహాసిని పాల్గొన్నారు.

## బాలికల సంరక్షణపై అవగాహన తరగతులు




**కాకినాడ,జూలై 25 (వార్తాప్రభ) :** పడాల ఛారిటబుల్ ట్రస్టు - స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ - పిల్లల సంరక్షణ కోసం - పర్సనల్ సేఫ్టీ ఎడ్యుకేషన్ (పిఎస్ఈ) పేరిట ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతోందని ట్రస్టు ముఖ్య కార్యనిర్వహణాధికారి పడాల సూర్య ప్రసాద్,కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్ సీఈవో మెర్ల మురళీధర్ వెల్లడించారు. స్థానిక హోటల్లో వారు మాట్లాడుతూ కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ వారి సహకారంతో డిసెంబర్ 18, 2023 న ఈ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. పసి పిల్లలపై లైంగిక వేధింపులు నివారించే దిశగా పడాల ఛారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ కార్యక్రమం కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలో ఉన్న అన్నీ ప్రభుత్వ పాఠశాలలో అమలు జరుగుతొందన్నారు.గత సంవత్సరం కాకినాడ జిల్లా పూర్వ కలక్టరు డా. కృతికా శుక్లా ద్వారా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా 1 నుండి 7 తరగతుల పిల్లలకు, ప్రైవేట్ పార్ట్స్, సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్, సేఫ్టీ రూల్స్, పోస్కో చట్టం, ఇంటర్నెట్ సేఫ్టీ వంటి విషయాలు పర్సనల్ సేఫ్టీ ఎడ్యుకేషన్ (పిఎస్ఈ) అనే మాడ్యూల్ ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కెఎస్పిఎల్ సహకారంతో ఇప్పటి వరకు కాకినాడ జిల్లాలో సుమారు 70పాఠశాల్లో ఈ కార్యక్రమం ద్వారా 6000 మందిని చేరుకోవడం జరిగిందన్నారు. పిల్లల భద్రత, రక్షణ మన అందరి బాధ్యత, ప్రతీ పాఠశాల, కళాశాల, హాస్టల్, ఇంట్లో పిల్లలు క్షేమంగా ఉండాలని,కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ (కెఎస్పిఎల్) సహకారంతో, జిల్లా విద్యా శాఖ సమన్వయంతో 3 జిల్లాలలో ఉన్న 75,000 మందికి పైగా చిన్న పిల్లలకు 2025 డిసెంబర్ లోపు ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవగాహన తరగతుల ద్వారా చిన్న వయసులోనే లైంగిక వేధింపుల గురించి తెలుసుకోవడం,వాటి నుంచి తప్పించు కోవడం, రిపోర్ట్ చేయడం వంటి చాలా కీలక మైన అంశాలు పిల్లలు నేర్చుకుంటారన్నారు. గత 2 సంవత్సరాల కాలంలో ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివ రకు 20,000 పిల్లల్ని చేరుకోవడం జరిగిందన్నారు.కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రామ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ని కలిసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

- పిఠాపురంలో ఎన్ఐఇఎల్ఐటి ఏర్పాటుకు వినతి
- సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రధాన్



**కాకినాడ,జూలై 25 (వార్తాప్రభ) :** పార్లమెంటు సమావేశాల్లో భాగంగా ఢిల్లీ పర్యటనలో ఉన్న కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ గురువారం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కాకినాడ జిల్లాలో విద్యారంగ అభివృద్ధి, కేంద్ర విద్యా సంస్థలు ఏర్పాటుపై చర్చించారు. అలాగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజవర్గంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక విద్యాసంస్థ అయిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ( ఎన్ఐఇఎల్ ఐటి) ని ఏర్పాటు చేయాలని కోరగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

## హనుమాన్ జంక్షన్ లో చురుగ్గా జనసేన సభ్యత్వాలు నమోదు



**హనుమాన్ జంక్షన్, జూలై 25 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జనసేన పార్టీ పనిచేస్తుందని గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు అన్నారు. గురువారం హనుమాన్ జంక్షన్ లో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో తనదైన శైలిలో సంచలనం సృష్టించారని అన్నారు. గతంలోకంటే సభ్యత్వనమోదు అనూహ్యంగా ఉందని అన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, టౌన్ పార్టీ అధ్యక్షుడు షేక్ అహమ్మద్, వీరం వినయ్ , సుంకర అర్జున్ , చలమలశెట్టి బుచ్చిబాబు , పూషడపు రామకృష్ణ , రేవిణిశెట్టి జితెంద్ర, కట్టా నరేంద్ర, వీర మహిళలు సింగవరపు సూర్యావతి, మద్దా జయరాణి, బండారు లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## పాస్ పుస్తకాల కోసం రైతులు ఎదురుచూపులు..

**గన్నవరం,జూలై 25 (వార్తాప్రభ) :** గన్నవరం మండల రెవెన్యూ కార్యాలయం పరిధిలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు నుంచి రైతులకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ నిలిచిపోయాయి. అధికారులందరూ ఎన్నికల హడావిడిలో ఉండటంతో పాస్ పుస్తకాలు అందరు భావించారు. ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడిన నెలరోజుల నుంచి కూడా పాస్ పుస్తకాలు పంపిణీ జరగటం లేదు. గ్రామ సచివాలయాలు, ఈ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్జీలు గన్నవరం కార్యాలయంలో పెండింగ్ లో ఉన్నాయి. రైతులు కార్యాలయాలకు వెళ్లి అడుగుతుంటే ఇదిగో చేస్తున్నాం అదిగో చేస్తున్నాం అంటూ క్షేత్రస్థాయి అధికారులు రైతులకు సమాధానం చెబుతున్నారు. సాధారణంగా గ్రామస్థాయిలో సన్నకారు చిన్న రైతుల కుటుంబ యజమాని చనిపోతే భూముల వారసత్వం మార్పిడి కోసం , కుటుంబంలో వాటాలు పంచుకున్న రైతులు భూములు పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకుంటారు. గ్రామాల్లో ఒక ఎకరం రెండు ఎకరాలు కొనుగోలు చేసుకున్న వారు కూడా పాస్ పుస్తకాల కోసం అప్లై చేసుకున్నారు. గత రెండు మాసాల నుంచి ఈ రకమైన దరఖాస్తులన్నీ గన్నవరం ఎమ్మార్వో కార్యాలయంలో పెండింగ్లో ఉన్నాయి. ఇదిలా ఉండగా దొడ్డి దారిలో పలుకుబడి ఉన్న వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు దరఖాస్తు చేసిన పాస్ పుస్తకాలు మాత్రం చక చకా ఇచ్చేస్తున్నారు. బక్క రైతులు సన్నకారు రైతులు పాస్ పాస్ పుస్తకాల కోసం పడిగాపులు పడాల్సి వస్తుందని చెబుతున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో పాస్ పుస్తకాలు వస్తే గాని బ్యాంకులో రుణాలు ఇవ్వడం లేదని సన్నకారు చిన్న కారు రైతాంగం వాపోతున్నారు. ఈ క్రమంలో అధికారులు వెంటనే స్పందించి పెండింగ్లో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలని రైతులు అధికారులను కోరుతున్నారు.



వీరులపాడు గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు వేగవంతం మురికి నీరు నిలవ లేకుండా దోమల మందు స్ప్రే. వర్షాకాలంలో వర్షపు నీరు పెద్ద ఎత్తున నిల్వ ఉండకుండా రోడ్డు ఇరువైపులా బీచ్ ఏర్పాటు. ప్రజలు అనారోగ్యం గురికాకుండా గ్రామపంచాయతీ పలు జాగ్రత్తలు, చర్యలు తీసుకుంటున్న చిత్రాలు -వీరులపాడు, జూలై 25 (వార్తాప్రభ) :

## నీలిపూడి లో శిక్షా సప్తాహ్ వారోత్సవాలు




**కృత్తివెన్ను,జూలై 25 (వార్తాప్రభ) :** కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి గాను ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని మండలంలోని నీలిపూడి గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం , నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇవ్వాలి అనే అంశాన్ని గుర్తెరిగి నీలిపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ సిబ్బంది గ్రామస్తుల సహకారంతో గ్రామస్తులు మరియు విద్యార్థులు కలిసి "కోలాటం" కళను ఎంఈఓ 1 బాలా త్రిపుర సుందరి మరియు ఎంఈఓ 2 ఎస్ కే వి డి ప్రసాద్ ఆధ్వర్యంలో అత్యద్భుత రీతిలో ప్రదర్శించటం జరిగింది. కోలాటం కళను వీక్షించిన మండల విద్యాశాఖాధికారులు కోలాటం కళను ప్రదర్శించిన విద్యార్థులను మరియు గ్రామస్తులను, అందుకు సహకరించిన ప్రధానోపాధ్యాయురాలు పీ వీ భారతి, ఉపాధ్యాయులు బీవీ శంకర్రావు,మరియు ఎస్ లావణ్య లను ప్రత్యేకంగా అభినందించారు.



## మైసమ్మ నగర్ లో బొడ్రాయి పండుగ కార్యక్రమం

**కుత్బుల్లాపూర్ జూలై 25 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట పరధిలోని మైసమ్మ నగర్ లో గురువారం జరిగిన బొడ్రాయి పండుగకు ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరిపై ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ జనరల్ సెక్రటరీ రవీందర్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చారీ, పిల్లి ఆంజనేయులు, వెను గౌడ్, కళ్యాణ్, 132 డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులకు ఆర్టీసీ బస్సుల్లో రాయితీ కల్పించాలని ఎమ్మెల్యే కీ వినతిపత్రం



**కుత్బుల్లాపూర్ జూలై 25 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ని కలిసి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులలో వయవృద్ధులకు టికెట్ పై రాయితీ కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలలో వయోవృద్ధులకు ఆర్టీసీ బస్సుల్లో కల్పిస్తున్న రాయితీ మాదిరిగానే తెలంగాణలో రాయితీ అమలయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలయ్యే విధంగా చూసేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేశం, కోశాధికారి మురళి గౌడ్, ఉపాధ్యక్షులు లింగం గౌడ్ సభ్యులు నాగేష్, వీరారెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో ఎదిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యం- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

### కుత్బుల్లాపూర్ పట్టణ మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా ఇందిరా రెడ్డి ఎన్నిక



**కుత్బుల్లాపూర్ జూలై 25 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ పట్టణ మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన ఇందిరా రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ పట్టణ మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన ఇందిరా రెడ్డి ని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సమాఖ్య సభ్యులు అందరూ కలిసికట్టుగా ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ పట్టణ మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు పద్మా గౌడ్, కార్యదర్శి సత్యవాణి, సంయుక్త కార్యదర్శి కుర్షిదా, కోశాధికారి శ్యామల, డైరెక్టర్లు అనిత, ఎం.పద్మ, ఆసియా, లావణ్య, కల్పన, లలిత, మంగ, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో గ్రీన్ ఇండియా మిషన్ వేడుకలు




**కూకట్ పల్లి, జులై 25 (వార్తాప్రభ):** స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా గ్రీనీ ఇండియా మిషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఏ.జీ.ఎం శివరామకృష్ణ, కోఆర్డినేటర్ మురళీకృష్ణ, ఆర్.ఐ పద్మజ పాల్గొన్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సూర్య కళ, పద్మజా, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలో సామాజిక స్పృహ కలిగించే విధంగా స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ఉందని తెలియజేశారు. చిన్న వయసు నుంచే విద్యార్థులలో చెట్లను పెంచాలి అనే అవగాహన కలిగించడం అభినందనీయమని చెప్పారు. చెట్లను మనం కాపాడితే అవి మనల్ని కాపాడతావని అన్నారు. ఈ కార్యక్రమంలో డిన్ రామకృష్ణ,సి.బ్యాచ్ ఇన్చార్జ్ శ్రీకాంత్ మరియు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జులై 25 నుంచి 28 వరకు మలబార్ గోల్డ్ డైమండ్స్ ఆర్టిస్ట్రీ జ్యువెలరీ ఆభరణాల ప్రదర్శన



**శేరిలింగంపల్లి,జూలై 25 (వార్తాప్రభ):** ప్రముఖ ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ డైమండ్స్ చందానగర్ శాఖలో ఆర్టిస్ట్రి జ్యువెలరీ ఆభరణాల ప్రదర్శనను గురువారం ప్రముఖ సినీనటి ఫిదా మూవీ ఫ్రేమ్ శరణ్య మేనేజ్మెంట్ మెంబర్స్ తో కలిసిప్రారంభించారు. ఈ సందర్భంగా నటి శరణ్య ప్రదీప్ మాట్లాడుతూ..ఇండియా, సింగపూర్ తో పాటు ప్రపంచ దేశాల్లో 350 పైగా షోరూమ్ లకు విస్తరించుకొని విజయవంతంగా నిర్వహించబడుతున్న ఏకైక జువెలరీ బ్రాండ్ మలబార్ గోల్డ్ అన్నారు. ఎప్పటికప్పుడు నూతన డిజైన్లతో అతివేగంగా అభివృద్ధి సాధిస్తున్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ సంస్థ తమ వార్షిక ఆదాయంలో కొంత వాటాను సామాజిక బాధ్యత రూపంలో ఆరోగ్యం,ఉచిత విద్య ,నిరుపేదలకు గృహ నిర్మాణ,మహిళా సాధికారత, పర్యావరణం పరిరక్షణ కోసం తన వంతు సాయం అందిస్తుందన్నారు. చందానగర్ మలబార్ శాఖలో జూలై 25 నుండి 28 వరకు ఆర్టిస్ట్రీ జువెలరీ ప్రదర్శన నిర్వహించబడుతుందని తెలిపారు. చందానగర్ శాఖ నిర్వాహకులు దీపక్ మాట్లాడుతూ ఆర్టిస్ట్ జువెలరీ పైన కొనుగోలుదారులకు 25 శాతం డిస్కౌంట్ ప్రత్యేకంగా ఇవ్వబడుతుందని తెలిపారు.



## కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చెయ్యి

### – కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ రెడ్డి



**తొర్రూరు జూలై 25 (వార్తా ప్రభ)** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చెయ్యి చూపించడం నరేంద్ర మోడీకి సరికాదన్నారు. కిసాన్ కాంగ్రెస్ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కందాడి అశోక్ రెడ్డి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్రానికి అనేక హామీలు ఇవ్వడం జరిగిందని, తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ తరఫున 8 మంది ఎంపీలు,8 మంది ఎమ్మెల్యేలు,ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన, బిజెపి పార్టీ ఎంపీలు నోరు మెదపక పోవడం దౌర్భాగ్యం అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి సరి అయిన బడ్జెట్ ను ఎందుకు కేటాయించలేకపోయిందో బిజెపి పార్టీ ఎంపీలు తెలంగాణ ప్రజలకు బడ్జెట్ పై స్పష్టత ఇవ్వాలని, ఆయన డిమాండ్ చేశారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేదన్నారు. మొదటినుండి తెలంగాణ పట్ల ప్రధాని నరేంద్ర మోడీ సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాడని అన్నారు. ప్రధాని మోడీ ఏపీ,బీహార్ సీఎంలకు భయపడి అధిక నిధులు కేటాయించి తెలంగాణకు రాష్ట్రానికి బడ్జెట్ కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని,రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమకు, ములుగులో గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించకపోవడం నరేంద్ర మోడీ తెలంగాణ ప్రాంతానికి చూపిస్తున్న వివక్షకు నిదర్శనం అన్నారు. వ్యవసారంగానికి,విద్యారంగానికి,పరిశ్రమలకు,ఇతర వాటికి అధిక నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిన పార్లమెంట్ లో మాట్లాడని బిజెపి పార్టీకి చెందిన ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వంపై అన్ని రాజకీయ పార్టీలు ప్రజలు బిజెపి పార్టీ ప్రజా ప్రతినిధులను గ్రామాల్లో తిరగకుండా అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## మహిళలపై అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు




**మహబూబాబాద్ జిల్లా జూలై 25 (వార్తా ప్రభ)** మహబూబాబాద్ జిల్లాకేంద్రం లోని ఫాణిని హైస్కూల్ నందు మహబూబాబాద్ షీ టీం అవగాహన సదస్సు "నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లాఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశానుసారంగా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య సూచనల మేరకు ,ఫానిని హై స్కూల్ మహబూబాబాద్ నందు షీ టీం భరోసా మరియు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మహబూబాబాద్ సి టీం ఎస్పై సునంద మాట్లాడుతూ . ఫాణీని హై స్కూల్ మహబూబాబాద్ లో దాదాపు 220 మంది విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాలు మహిళలపై అత్యాచారాలు విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కార్యక్రమంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు ఈవిటీజింగ్, గుడ్ టచ్ బాడ్ టచ్ లపై అవగాహన పెంచుకోవాలని అన్నారు ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియాలలో వ్యక్తిగత ఫోటోలు వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలి వివరించారు. మనకు తెలియని నెంబర్స్ నుండి మహిళలకు ఎవరి నుండైనా ఇబ్బందులకు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా అసభ్యంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా షీ టీం కి సమాచార అందించాలని సూచించారు మా షీ టీం మొబైల్ నెంబర్స్ మరియు వాట్సాప్ నెంబర్స్ 871 2656 935 790 11 42 009 ఫిర్యాదు చేయవచ్చని ఫిర్యాదు చేసిన వివరాలు గోప్యంగా ఉంచబడతాయని నేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు వారి తల్లిదండ్రులతో మరియు కుటుంబ సభ్యులతో పంచుకోవాలని అలా చెప్పుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలోనే నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఆపద లేదా అత్యవసర సమయంలో పోలీస్ ఎమర్జెన్సీ నెంబర్ డయల్ 100 సేవల కూడా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫాణిని హై స్కూల్ హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు సార్, సీనియర్ ఉపాధ్యాయుడు వెంకన్న సార్ మరియు వారి అధ్యాపక సిబ్బంది షీ టీం ఏఎస్ఐ ఆనందం గారు మరియు షీ టీం సిబ్బంది అరుణ,రమేష్ ఏ హెచ్ టి యు సిబ్బంది సుప్రజ, భరోసా స్టాప్ జోష్ణ, రేణుక పాల్గొన్నారు.

## అక్రమ నల్ల కనెక్షన్లను తొలగించి అందరికి నీళ్లు సమృద్ధిగా ఇవ్వాలి..

### –బీజేపీ నేత కుమార్ యాదవ్.



**కూకట్ వల్లి, జులై 25 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పీజేఆర్ కాలనీ లో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ అధ్యక్షులు కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు కేశవరావు మరియు బీజేపీ నాయకులతో కలిసి బస్తి పర్యటన చేసి స్థానికంగా నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులతో కలిసి అక్రమ మంచినీటి కనెక్షన్లు తొలగించాలని,వాటర్ వర్క్స్ డీజీఎం నాగ ప్రియను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్,ఎన్టీఆర్ నగర్, దత్తాత్రేయ కాలనీ తదితర కాలనీలలో కాసులకు కక్కుర్తి పడి వాటర్ వర్క్ సిబ్బంది అదనపు అక్రమ మంచినీటి కనెక్షన్లను ఇవ్వడం వల్ల అందరికీ సరిపడా నీళ్లురాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే అట్టి అక్రమ కనెక్షన్లను తొలగించి సమృద్ధిగా నీళ్లు అందించాలని డీజీఎంను కోరామని వారు కూడా సానుకూలంగా స్పందించారని అన్నారు. భవిష్యత్తులో మళ్లీ పునరావృత్తం కాకుండా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ లైన్ల మరమ్మత్తులను కూడా వెంటనే చేపట్టి ప్రజలకు డ్రైనేజీ సమస్య నుండి ఉపశమనం కల్పించాలన్నారు. ప్రజా ప్రతినిధులు కేవలం పర్యటనలకే తప్ప పరిష్కారం చేయలేరన్నారు. అభివృద్ధి సాకుతో పార్టీలు మారి పబ్బం గడుపుకోవడం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందే లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు,శ్రీనివాస్,రఘు, శివాజీ,కవిత,అనిత,సురేష్ రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## దొంగిలించబడిన, పోగొట్టుకున్న 345 మొబైల్ ఫోన్స్ రికవరీ చేసిన పోలీసు వర్గాలు



**శేరిలింగంపల్లి,జూలై 25 (వార్తాప్రభ):** 30 రోజుల్లో దొంగిలించబడిన, పోగొట్టుకున్న 345 మొబైల్ ఫోన్లను సైబరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డిసిపిక్రైమ్స్ కె.నరసింహ పర్యవేక్షణలో ఐటి సెల్,సామాజిక బృందం సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సి ఇఐఆర్) పోర్టల్ను ఉపయోగించి 30 రోజుల్లో 345 మొబైల్ పరికరాలను విజయవంతంగా రికవరీ చేసింది. స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను సైబరాబాద్ కమిషనరేట్ ప్రధాన సమావేశ మందిరంలో డీసీపీ క్రైమ్స్ కె.నరసింహ బుధవారం యజమానులకు అందజేశారు. డీసీపీ క్రైమ్స్హా కె.నరసింహ మాట్లాడుతూ.. నిత్యజీవితంలో మొబైల్ ఫోన్లు కీలకమని, ఎన్నో ముఖ్యమైన సమాచారం,జ్ఞాపకాలను కలిగి ఉంటారన్నారు. పోలీసులు రికవరీలో పట్టుదలతో ఉండాలని సూచించారు. దొంగిలించబడిన మొబైల్లు దుర్వినియోగం కాకుండా నిరోధించడానికి, పోగొట్టుకున్న మొబైల్ల వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్కు లేదా సిఈఐఆర్ పోర్టల్ కి నివేదించాలని డీసీపీ సూచించారు. విజయవంతంగా మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న ఏసీపీ క్రైమ్స్ కళింగరావు,ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ జగదీశ్వర్,ఐటీ సెల్ బృందాన్ని డీసీపీ క్రైమ్స్ అభినందించారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్లు అందుకున్నవారు సంతోషంతో కృతజ్ఞతలు తెలిపారు.



## బిజెపి మండల కార్యవర్గ సమావేశం

### – ముఖ్య అతిథిగా మానుకోట జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు



**తొర్రూరు జూలై 25 (వార్తాప్రభ)** పట్టణ కేంద్రంలో స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో తొర్రూర్ మండలాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం తొర్రూర్ అర్బన్ మండల అధ్యక్షుడు అలిసేరి రవిబాబు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగామానుకోట జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు విచ్చేసి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై గళమెత్తి పోరాడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్గారంటను అమలు చేయాలని వారు కోరారు. కావున ప్రభుత్వంవెంటనె స్పందించి రైతు బందుకు నిదులు విడుదల చేయాలని డిమండ్ చేసారు. ఈ కార్యక్రంలో పలు రాజకీయ, వ్యవసాయ తీర్మానాలను అమోదించారు. ప్రజల పక్షాన సమస్యలపై పోరాటం చేయడానికి బిజెపి ముందు వరుసలో ఉంటుదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి,తొర్రూర్ మునిసిపల్ కౌన్సిలర్ కొలుపుల శంకర్, తొర్రూర్ రూరల్ మండల అధ్యక్షుడు కస్తూరి పులేందర్, ప్రధాన కార్యదర్శి కొండ యాకన్న, బిజెపి మండల నాయకులు చెన్నోజు వెంకటేశ్వర్లు, కందగట్ల సోమశేఖర్, కిన్నెర యాదగిరి, రవితేజ, బషీర్, శేఖర్, భాస్కర్, కుమారస్వామి, సోమాని, సంతోష్, అశోక్, వెంకటేష్, రవి, సందీప్, రామ్మూర్తి, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లపోచమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు,బోనం సమర్పించిన వడ్డేపల్లి కుటుంబ సభ్యులు.

**కూకట్ పల్లి, జులై 25 (వార్తాప్రభ):** జగజ్జనని జగన్మాత ఎల్ల లోకాలనేలుతున్న ఆదిపరాశక్తి ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా కూకట్ పల్లి లోని గ్రామ దేవత ఏడు గుడిల శ్రీ పోచమ్మ తల్లి ఆలయం నందు నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాల్లో సతీ సమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం,బోనం సమర్పించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు,ఆలయ కమిటీ సభ్యులు సన్మానించడం జరిగింది. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారి చల్లని ఆశీర్వాదంతో ప్రతి ఏటా కుటుంబ సమేతంగా బోనం సమర్పించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఆరోగ్యకరంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించడం జరిగింది అని తెలియజేశారు.



# ఎడిటోరియల్

## జగన్ ఢిల్లీ ధర్నాలో మొత్తం విజయసాయిరెడ్డిదే హవా !

వైసీపీలో విజయసాయిరెడ్డిది నంబర్ టూ ప్లేస్. ఆయన జగన్ పక్కన ఉంటే విజయమే దక్కుతుంది అనడానికి 2019 ఎన్నికలు నిదర్శనం. ఆయన 2024లో నెల్లూరు ఎంపీగా పోటీ చేయడానికి వెళ్ళడంతో పార్టీ చాలానే మిస్ అయింది అని అంటారు. మొత్తానికి వైసీపీ దారుణ ఓటమికి సవాలక్ష కారణాలలో విజయసాయిరెడ్డి సేవలు కూడా పూర్తిగా పార్టీ వినియోగించుకో కపోవడం ఒక కారణం అని అంటారు. అది అలా ఉంచితే విజయసాయిరెడ్డి 2016 నుంచి రాజ్యసభ మెంబర్ గా ఉన్నారు. గత ఎనిమిదేళ్ళుగా ఆయన ఢిల్లీ రాజకీయాల్లో పట్టు సాధించారు. అప్పట్లో అంటే 2014 నుంచి 2019 మధ్య జగన్ విపక్షంలో ఉంటే ఢిల్లీలోని పెద్దలతో టచ్ లో ఉంటూ అపాయింట్మెంట్లు జగన్ కి దక్కేలా చూడడంలో విజయసాయిరెడ్డిదే కీలక పాత్ర అని అంతా చెప్పుకునేవారు. విజయసాయిరెడ్డికి బీజేపీ పెద్దలతోనే పరిచయాలు అని అనుకుంటారు కానీ ఢిల్లీ స్థాయిలో ఆయనకు అన్ని పార్టీలతో మంచి సంబంధాలు ఉన్నాయని మరో మారు రుజువు అయింది. తాజాగా ఢిల్లీలో జగన్ వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో దాదాపుగా అరడజన్ కి పైగా పార్టీలు హాజరయ్యాయి అంటే అదంతా విజయసాయిరెడ్డి పలుకుబడి అని అంటున్నారు. విజయసాయిరెడ్డి మాట మేరకే అనేక పార్టీలు హాజరై ధర్నాకు కళ కట్టించారు అని చెబుతున్నారు. విజయసాయిరెడ్డి నిత్యం అనేక పార్టీలతో సన్నిహితంగా మెలుగుతూ ఉంటారని అంటారు. ఆయనను పేరు గుర్తు పెట్టుకుని మరీ పిలిచేటంత పరిచయం మోడీ దగ్గర సంపాదించారు. తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సైతం విజయసాయిరెడ్డి భేటీ కావడం ఒక సంచలనం గానే చెప్పుకున్నారు. ప్రస్తుత పార్లమెంట్ లో దాదాపుగా 48 పార్టీలు ఉంటే అందులో సగానికి పైగా పార్టీలతో వాటికి సంబంధించిన కీలక నేతలతో విజయసాయిరెడ్డికి మంచి పరిచయాలు ఉన్నాయని అంటారు. అందుకే వైసీపీ ధర్నాలో ఎవరూ పాల్గొంటారు అని అంతా ఆసక్తిగా చూసారు కానీ విజయసాయిరెడ్డి మాత్రం ఆ డౌట్లు అన్నీ క్లారిఫై చేసేలా బాగానే పార్టీలను ధర్నా వేదిక వద్దకు తెచ్చారని అంటున్నారు. వైసీపీలో విజయసాయిరెడ్డి ఎపుడూ కీలకంగానే ఉంటూ వస్తున్నారు. ఇటీవల ఆయన పరపతి తగ్గిందని పార్లమెంటరీ పార్టీ నేతగా ఆయనని తప్పించారని రాజ్యసభకు నేతగా మాత్రమే పరిమితం చేసారని ప్రచారం జరిగింది. అయితే ఢిల్లీ ధర్నా చూసాక విజయసాయిరెడ్డి పరపతి ఎక్కడా తగ్గలేదని అంతా నమ్ముతున్నారు. వైసీపీ అధినాయకత్వం ఆయన సేవలను ముందు ముందు మరింతగా ఉపయోగించుకుంటుంది అని కూడా అంటున్నారు. మొత్తానికి వైసీపీ ధర్నా వెనక ఉన్న విజయసాయిరెడ్డి గురించే ఇపుడు అంతా చర్చించుకోవడం చూస్తే సాయిరెడ్డి హవా మామూలుగా లేదుగా అనే మాటే అంటున్నారు.

## శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ హరినాథ్



**విజయవాడ పశ్చిమ జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానము, ఇంద్రకీలాద్రిపై గురువారం సాయంత్రం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ హరినాథ్ ఆలయమునకు విచ్చేయగా ఆలయ ఈవో కె ఎస్ రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు శ్రీ అమ్మవారి పంచ హారతుల సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ వేదపండితులు వీరికి వేదాశీర్వచనం చేయగా ఆలయ ఈవో శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేష వస్త్రము, చిత్రపటం అందజేశారు.

## విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్



**విజయవాడ పశ్చిమ జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎం ధ్యానచంద్ర ఐఏఎస్ గురువారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ని మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి కమిషనర్ హెచ్ఎం ధ్యాన చంద్ర ఐఏఎస్ ని స్వాగతిస్తూ, పూల మొక్కను ఇచ్చారు.

## మైనారిటీ ఫంక్షన్ హాల్ కి సహకరించాలని వినతి పత్రం

**పుట్టపర్తి జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి లో ముస్లిం మైనారిటీ అబ్దుల్ కలాం ఫంక్షన్ హాల్ కి పూర్తిగా సహకరించాలని రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి మహమ్మద్ షారుక్ ను రాష్ట్ర టిడిపి ముస్లిం మైనార్టీ కార్యదర్శి మహమ్మద్ రఫీ కోరారు. ఐదు సంవత్సరాల క్రితం నిలిచిపోయిన పనులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు విడుదల చేయాలని గురువారం సచివాలయంలో మంత్రికి వినతి పత్రం అందజేశారు.

# ప్రజా ప్రయోజనం కోసం కదంతొక్కిన ఆటో డ్రైవర్స్

## ఎట్టి చాకిరి కష్టార్జితంతో సమాజ హితంకోసం స్వయంబుగా సి.సి కెమెరాలు అందచేత...



**గుంటూరు జులై 25 ( వార్తాప్రభ ప్రతినిధి ):–** ఇలపై మనిషిగా జన్మెత్తిన వారు కారాదు మట్టి బొమ్మ...కృషి , పట్టుదల , తెలివితేటల ఉత్సాహసాధనతో తాను బ్రతకటంతో పాటు సాటి మనిషిగా పదిమందికి మేలు చేయడం మానవపుట్టుక కర్తవ్యమని నిరూపించారు ఆటో డ్రైవర్స్ . వివరాల్లోకి వెళ్ళితే అటు గుంటూరు రైల్వే స్టేషన్ కు ఇటు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కి అనుదినం మెండుగా జనులు రాకపోకలను కొనసాగించటం మూలంగా రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల ఏమైనా ప్రజా ఇబ్బందికర వాతావరణం తలెత్తకుండా ఉండేందుకు ముందు జాగృతిలో భాగంగా ఆటో డ్రైవర్స్ కు ఈ ఏరియాలో సి.సి కెమెరాలు ఏర్పాటుకు గల ఆవశ్యకతను గూర్చి ఆటో స్టాండ్ల నిర్వాహకులతో పాటు ఆటో డ్రైవర్స్ కు సవివరంగా కార్యగోష్టిని నిర్వహించి వాటి యొక్క ప్రాధాన్యతను పోలీస్ వారు విన్నవించారు. ఇంతటితో ఉభలాస పరులైన ఆటో డ్రైవర్స్ మానవ సేవే మాధవ సేవ అన్న సంకల్పంతో తోటి మానవులకి మానవునిగా సహృదయాన్ని జోడింపచేసి తమవంతుగా దోహదపడటం మానవ జన్మ కర్తవ్య బాధ్యతను నెరవేర్చిన వారమౌతమన్న ధోరణితో ఆటో డ్రైవర్స్ కలిసి కట్టుగా కంకణం కట్టుకొని అటు రైల్వే స్టేషన్ కు ఇటు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి అనునిత్యం అధిక మోతాదులో జనసాంద్రత మిక్కిలిగా ఉండటం దృశ్యా అట్టి వారికి రాకపోకలయందు కూసింత హాని కలుగకూడదన్న ధృఢ సంకల్పంతో తోటి మానవునిగా సహృదయాన్ని పంచుకొని తాము రెక్కలు ముక్కలైయేటట్లుగా ఎట్టి చాకిరి చేసి కష్టార్జితంగా సంపాదించిన పైకంతో గురువారం నాడు కొత్తపేట పోలీస్ స్టేషన్ యస్. హెచ్.ఓ షేక్ అన్వర్ భాషా తో పాటు ఈస్ట్ ట్రాఫిక్ సి.ఐ బి.కోటేశ్వరరావు ఉభయ పోలీస్ అధికారులకు తమ స్వహస్తాలతో సి.సి కెమెరాలను అందించి మానవత్వాన్ని పంచుకున్నారు. రైల్వే స్టేషన్ ఏరియా మరియు ధర్మాసుపత్రి ఏరియాలకు సంబంధించి ఆటో డ్రైవర్స్ ఐచ్ఛికంగా ఒకేగళంతో ఏకతాటియై స్వచ్ఛందంగా ముందుకొచ్చి స్వయానా సి.సి కెమెరాలు అందచేసి పోలీస్ వారికి సహకరించి పాల్పొంచుకొన్నందులకు గుంటూరు జిల్లా ఎస్పీ యస్.సతీష్ కుమార్ తో పాటు ఈస్ట్ లా అండ్ ఆర్డర్ డి.యస్.పి నచికేట్ షెల్కే , గుంటూరు అర్బన్ ట్రాఫిక్ డి.యస్.పి యం.బాలసుందరావు ఆటో డ్రైవర్స్ ని శభాష్ అంటూ చిరునవ్వుతో అభినందించారు. ఇంతటి బహుత్తర సేవా కార్యక్రమంలో వివిధ ఆటో స్టాండ్ల నిర్వాహకులతో పాటు ఆటో డ్రైవర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇగ్నో ఆధ్వర్యంలో జూలై 2024 సెషన్కు దరఖాస్తులకు ఆహ్వానం

■ ఇగ్నో రీజనల్ డైరక్టర్ డాక్టర్ డి.ఆర్.శర్మ వెల్లడి



**విజయవాడ పశ్చిమ జూలై 25,(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇగ్నో రీజనల్ సెంటర్ విజయవాడ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో జూలై 2024 సెషన్కుదరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు, జూలై 31 చివరి తేదీ వరకు గడువు లోపే దరఖాస్తు లు పంపాలని ప్రాంతీయ కేంద్రం సంచాలకులు డాక్టర్ డి.ఆర్. శర్మ చెప్పారు. విజయవాడలో పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని హిందూ హైస్కూలు ప్రాంగణంలో గల ఇగ్నోకార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడి ప్రాంతీయకేంద్రం పరిధిలో 15 జిల్లాలకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ కేంద్రం పరిధిలో 12 అధ్యయన కేంద్రాలు పనిచేస్తున్నాయని, అలాగే 44 మాస్టర్ డిగ్రీ, 24 డిగ్రీ, 46 డిప్లొమో, పిజిడిప్లొమా, 60 సర్టిఫికెట్ కోర్సులు అందచేస్తున్నామన్నారు. గతంలో కంటే విద్యార్థుల కోసం ఇంకా ఎక్కువ కోర్సుల్లో విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో కోర్సులు సంఖ్య పెంచామని మొత్తం 246 కోర్సులు అందచేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది అమరావతి రాజధాని పరిధిలోని వెంకటాయపాలెం నిర్మిస్తున్న ఇగ్నో సొంత భవనాల్లో ఇగ్నో కార్యకలాపాలు జరుపుతామని ఆయన ప్రకటించారు. అలాగే నూతనంగా ఎంఎభగవద్గీత కోర్సు ఎంబిఎ కన్స్ట్రక్షన్ మేనేజ్ మెంట్, హెల్త్ కేర్అండ్ హాస్పిటల్అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్ అండ్ సప్లయి చైన్మేనేజ్మెంట్, ఎబిఎన్బిజినెస్ మేనేజ్ మెంట్, ఎంఎ అప్లయెడ్ ఉర్దూ ప్రారంభించామన్నారు. నర్సరీ పిల్లలకు బోధించే విజి డిప్లొమా ఇన్ ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్కూడా ప్రారంభించినట్లు చెప్పారు. మొత్తంగా 13 కొత్త కోర్సులను ప్రారంభించినట్లు ఆయన వివరించారు. ఎంఎ సైకాలజీ, కౌన్సిలింగ్మరియు ఫ్యామిలీథెరపీ వంటి కోర్సులకు డిమాండ్ ఎక్కువగా వుందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరక్టర్లు డాక్టర్ కె. సుమలత, బి.ప్రసాదబాబు తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఒత్తిడికి ఉపశమనం యోగ.

## – జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ!!!

**మచిలీపట్నం జూలై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం గురువారం ప్రభుత్వ ఉద్యోగులు తమ దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించి చురుకుగా ఉద్యోగ విధుల్లో పాల్గొనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రత్యేక చొరవతో నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో చేపట్టిన ఉచిత యోగ శిక్షణ తరగతులకు మంచి స్పందన లభిస్తోంది. ఈ శిక్షణా తరగతులు గత మూడు రోజులుగా ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు 65 మంది జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులకు తక్కువ కాకుండా నిరాటంకంగా సాగుతున్నాయి. జిల్లా సర్వోన్నతాధికారిగా పలు కార్యక్రమాలు, సమావేశాలతో పనుల ఒత్తిడి ఉన్నప్పటికీ లెక్క చేయక జిల్లా కలెక్టర్ గత మూడు రోజులుగా క్రమం తప్పకుండా ఉదయం 6 గంటలకే శిక్షణ తరగతుల్లో స్వయంగా పాల్గొంటూ యోగ సాధన చేస్తూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. వారు తన జీవన శైలిలో యోగాసాధనను ఒక భాగంగా చేర్చుకొని ముందుకు సాగుతున్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు వారి సతీమణి పృధ్వి కళ్యాణి కూడా శిక్షణ తరగతులలో పాల్గొనడం చెప్పుకోదగ్గ విశేషం. యోగా గురువులు ముదిగొండ శాస్త్రి, మద్దాల చింతయ్య ఉద్యోగులకు సులభతర వ్యాయామం, కపాలభాతి, భస్త్రిక ప్రాణాయామం అనులోమ, విలోమా ప్రాణాయామాలు ధ్యానం తదితర యోగాసనాలలో శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కలెక్టర్, వారి సతీమణి యోగా గురువులు చెప్పిన విధంగా ఆహార నియమాలు పాటించడం ప్రారంభించారు ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి కె చంద్రశేఖర రావు, ఖజానా శాఖ ఉపసంచాలకులు రవికుమార్, జిల్లా పశుసంవర్ధక అధికారి శ్రీనివాసరావు, సమాచార పౌర సంబంధాల శాఖ డిడి యమ్. వెంకటేశ్వర ప్రసాద్, భూ సర్వే రికార్డుల ఏడి మనిషా త్రిపాఠి, విద్యుత్ శాఖ ఈఈ భాస్కర్ రావు,క్రీడల చీఫ్ కోచ్ ఝాన్సీ లక్ష్మి తదితర జిల్లా అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది వారి కుటుంబ సభ్యులను కూడా ఈ శిక్షణ తరగతులకు తీసుకుని రావచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. యోగా సాధనతో తమ జీవన శైలిలో మార్పులు కనబడుతున్నాయని యోగా సాధకులు తమ అనుభవాలను పంచుకుంటున్నారు. శారీరిక రుగ్మతలు, అనారోగ్యం పాలైతే లక్షలాది రూపాయలు వైద్యానికి ఖర్చు చేయాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే యోగాసనాలు పైసా ఖర్చు లేకుండా ఉచితంగా నగరంలోనే అందుబాటులో జిల్లా కలెక్టర్ చొరవతో చేపట్టిన శిక్షణా తరగతులను ప్రతి ఒక్క ఉద్యోగి అందిపుచ్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా ఉద్యోగులు ఒకసారి ఆలోచిస్తే బాగుంటుంది.



# చేనేత కార్మికులతో క్లస్టర్ ఏర్పాటుపై ప్రత్యేక సమావేశం



**అనుమసముద్రంపేట జులై 25 (వార్తాప్రభ)** మండలంలోని కావలి యడవల్లి గ్రామంలో చేనేత క్లస్టర్ ఏర్పాటుపై గురువారం ప్రత్యేక సమావేశాన్ని చేనేత కార్మికులతో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముప్పూరి ధనమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి నెల్లూరు జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి వరప్రసాద్ డెవలప్మెంట్ ఆఫీసర్ మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కావలి యడవల్లి గ్రామంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు గురించి చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించి పలు విషయాలు సమస్యలపై చేనేత కార్మికులతో చర్చించి అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులకు ముద్ర లోన్లు వర్క్ షెడ్లు మరియు హెచ్ఎస్ఎస్ సామాగ్రి తదితర అంశాలపై చేనేతలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు లోన్లు విషయమై గ్రామంలోని కెనరా బ్యాంక్ మేనేజర్ తో చేనేత జౌళి శాఖ అధికారులు చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు ఏలూరు మల్యాద్రి నాయుడు గ్రామ చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# నాలుగవ రోజు శిక్షా సప్తాహ్ వారోత్సవాలు

**చేజర్ల జులై 25 (వార్తాప్రభ)** శిక్షా సప్తాహ్ వారోత్సవాలలో 4 వ రోజు అయిన గురువారం కల్చరల్ డే ను చేజర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా భాగంగా కళలు మరియు సంస్కృతి అభివృద్ధి సాంస్కృతిక వైవిధ్యం ప్రోత్సాహం ప్రదర్శన నృత్యాలు జానపదాలు హరికథలు బుర్రకథలు పెయింటింగ్స్వివిధ భాషల సంస్కృతిని విద్యార్థులకు తెలియజేయడం కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చేజర్ల టి కే పాడు ఉన్నత పాఠశాలల్లో సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు వచ్చారు. ఆదురుపల్లి ఉన్నత పాఠశాలలో భరతమాత చిత్రాన్ని నేలపై చిత్రించారు. ఏటూరు నందు విద్యార్థులు సంప్రదాయ వేషధారణలు స్వాతంత్ర సమర వీరుల గాథను బుర్రకథగా చెప్పారు. ఓబులాయిపల్లి నూతక్కి వారి కండ్రిక మొదలైన పాఠశాలల్లో జానపద నృత్యాలతో విద్యార్థులు అలరించారు.





## సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్" కు దరఖాస్తులు ఆహ్వానం- జిల్లా కలెక్టర్!!!




**మచిలీపట్నం జూలై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం గురువారం విపత్తు నిర్వహణ రంగంలో వ్యక్తులు లేదా సంస్థలు చేసిన అద్భుతమైన పనిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం "సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్" పేరుతో వార్షిక అవార్డును ఏర్పాటు చేసిందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులను ప్రతి సంవత్సరం జనవరి 23వ తేదీన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ప్రకటించడం జరుగుతుందని, అవార్డులలో ఒక సంస్థ లేదా వ్యక్తికి వరుసగా రూ. 51 లక్షలు, 5 లక్షల నగదు పురస్కారాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో 2025 సంవత్సరానికి "సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారం" కోసం ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఈ నెల ఒకటవ తేదీ నుండి ఆగస్టు 31వ తేదీ వరకు అర్హులైన వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను https://awards.gov.in వెబ్ సైట్ నందు పొందాలని సూచించారు.

# డివిజన్లలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

## పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్

**విజయవాడ పశ్చిమ జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గ డివిజన్లలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తెలిపారు. జోనల్ కమిషనర్ బి రమ్య కీర్తన శానిటేషన్ సిబ్బంది టౌన్ ప్లానింగ్ అధికారులతో



కలిసి గురువారం 40 వ డివిజన్లోని సభాపతి రోడ్డు బాజీ బాబా మందిరం భగత్ సింగ్ రోడ్డు ఆశ్రమం రోడ్డు తదితర ప్రాంతాలలో పర్యటించారు. రోడ్లు పారిశుధ్య నిర్వహణ డ్రెయిన్లు తీరును పరిశీలించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సభాపతి రోడ్డు నుంచి స్వాతి థియేటర్ వైపునకు అనుసంధానంగా రోడ్డు ఏర్పాటు చేయమని స్థానికులు కోరగా కార్పొరేషన్ అధికారులతో చర్చించి రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు .బేతపూడి అరుణకుమారి వీధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని దోమలతో ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల వర్షాలకు చెట్లు కూలిపోయాయని స్థానికులు తెలియజేశారు. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి తక్షణమే సమస్యను పరిష్కరిస్తామని జోనల్ కమిషనర్ రమ్య కీర్తన తెలిపారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్య పాలనలో డివిజన్లలో పారిశుధ్యం అధ్వాన్నంగా మారిందని ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో ప్రజల వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నామని ప్రత్తిపాటి శ్రీధర్ తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు ఏఈ అహ్మద్ శానిటరి ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు ఏఈ రవీంద్ర టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గ్రంథం ప్రసాద్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్గిల్ స్ఫూర్తిని నేటి యువత అందిపుచ్చుకోవాలి

**విజయవాడ పశ్చిమ జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కార్గిల్ విజయ దివాస్ స్ఫూర్తిని నేటి యువత అందిపుచ్చుకొని దేశభక్తిని మరింతగా పెంపొందించుకోవాలని భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ అన్నారు. భారతీయ జనతా యువ మోర్చా, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కార్గిల్ విజయ దివాస్, ఒలంపిక్‌లో భారత క్రీడాకారులు పతకాలను సాధించాలని కోరుతూ ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ ర్యాలీని అడ్డూరి శ్రీరామ్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కిటప్పవైద్యనాథన్‌లు ప్రారంభించారు. అనంతరం అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం కార్గిల్‌లో భారతదేశం, పాకిస్థాన్ దేశాల మధ్య జరిగిన యుద్ధంలో అనేక మంది భారత జవాన్లు వీరోచిత పోరాటం కొనసాగించారన్నారు. ఆ క్రమంలో విజయం సాధించామన్నారు. ఆ విజయాన్ని, ఆనాటి అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ కార్గిల్ విజయ దివాస్ పేరుతో ప్రతి ఏటా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అటువంటి దేశభక్తుల త్యాగాలను, పోరాటాలను నేటి యువత అందిపుచ్చుకోవాలన్నారు. విద్యతో పాటుగా సామాజిక సేవలను, దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. డాక్టర్ వైద్యనాథన్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి ఒలంపిక్స్






ప్రారంభమవుతున్నాయన్నారు. ఆ క్రీడల్లో మన క్రీడాకారులు మరిన్ని విజయాలను అందుకోవాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. విద్యార్థులందరూ స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాన్ని నిర్వహించటం అభినందనీయమన్నారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర యువమోర్చ అధ్యక్షులు మిట్టా వంశీ, రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షులు షేక్ బాజి, జిల్లా ఇంఛార్జ్ మువ్వల సుబ్బయ్య, రాష్ట్ర మహిళా నాయకురాలు బొద్దు నాగలక్ష్మి, బిజెపి రాష్ట్ర బీసీ నాయకులు పట్నాయక్, బిజెపి యువమోర్చా నాయకులు చైతన్య శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు కోలపల్లి గణేష్, భోగవల్లి శ్రీధర్, నాయకులు పైలా సురేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఎన్‌సీసీ ఆఫీసర్ కేపీటీవీ విజయభాస్కర్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు ఎన్ సాంబశివరావు, పీ పవన్‌కుమార్, క్రీడా విభాగాధిపతి డీ హేమచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



## బెజవాడ శ్రీకనకదుర్గమ్మ హుండీల లెక్కింపు

### 15 రోజులకు రూ 2 కోట్ల 63 లక్షల 18 వేల 540 లు ఆదాయం

### రోజుకు సగటున రూ 17 లక్షల 54 వేల 569 లు ఆదాయం

**విజయవాడ పశ్చిమ జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్దానము, ఇంద్రకీలాద్రిపై గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. 15 రోజులకు నగదు రూ.2,63,18,540/- ఆదాయం రాగా రోజుకు సగటున రూ. 17,54,569/లు ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు వెల్లడించారు.కానుకల రూపములో బంగారం: 380 గ్రాములు, వెండి: 5 కేజీల 540 గ్రాములు భక్తులు హుండీ ద్వారా సమర్పించుకున్నారన్నారు. విదేశీ కరెన్సీ యు ఎస్ ఏ 281 డాలర్లు,ఆస్ట్రేలియా 70 డాలర్లు,ఇంగ్లాండ్ 20 పౌండ్లు,ఓమన్ -401 రియాల్స్, కేనెడా 5 డాలర్లు, యు ఏ ఈ 10 దిర్హమ్స్,సింగపూర్ 10 డాలర్లు,యూరప్ 110 యూరోలు,ఇజ్రాయెల్ 20 షేకల్స్,మలేషియా 1 రింగ్గిట్స్,సౌదీ 10 రియాల్స్ వచ్చాయన్నారు.ఈ లెక్కింపు లో ఆలయ ఈవో కె ఎస్ రామరావు , డీప్యూటీ ఈవో లీలా కుమార్ , దేవాదాయ శాఖ అధికారులు, ఏ ఈ ఓ లు మరియు ఆలయ సిబ్బంది, ఎస్ పి ఎఫ్, మరియు వన్ టౌన్ పోలీసు సిబ్బంది, అమ్మవారి సేవా దారులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆన్ లైన్ నందు ..ఈ..హుండీ ద్వారా రూ. 54,228/-లు భక్తులు చెల్లించుకున్నారనిడిప్యూటీ కలెక్టర్ మరియు ఆలయ కార్యనిర్వహణాధికారి కే ఎస్ రామారావు వివరించారు.

## ఆక్రమణలు వెంటనే తొలగించండి-ఆర్డీఓ మధులత



**చేజర్ల జులై 25 (వార్తాప్రభ)** మండలం లోని తూర్పు ఖమ్మంపాడు గల ఆక్రమణలు తొలగించాలని ఆర్డిఓ కే మధులత పేర్కొన్నారు.ఈ సంధర్భంగా గురువారం గ్రామంలో పర్యటించి ఆమె మాట్లాడుతూ పశువుల దిబ్బ అడ్డంగా ఉందన్నారు. రోడ్డుకు అడ్డంగా ఉండటంతో వెంటనే తొలగించాలన్నారు.గ్రామ కంఠం ఆక్రమణకు గురైందని వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. పెల్లేరు పెన్నా పోరంబోకు ఆక్రమించుకుని వేరుశనగ పంట వేశారని తొలగించాలని అన్నారు. మండల అధికారులు వెంటనే వారికి నోటీసులు ఇవ్వాలని అధికారులుకు సూచించారు. పెన్నా పోరంబోకు ఆక్రమణ గూర్చి విచారణ చేపట్టారు.ఈ కార్యక్రమంలో డిటి అశోక్ కుమార్ ఎంపీడీవో విజయలలిత ఆర్ ఐ సుమతి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో కదిలిన ఆరోగ్య సిబ్బంది



**మడకశిర జులై 25 (వార్తాప్రభ)** శ్రీసత్య సాయి జిల్లా అమరాపురం మండలం కెంకెర గ్రామంలోకొన్ని రోజుల నుంచి ప్రజలు వాంతులు విరేచనాలతో పక్క రాష్ట్రాం ఆసుపత్రులకు పోతున్నారు. విషయం తెలుసుకున్న మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు గురువారం ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే ఆరోగ్య సిబ్బందిని కెంకెరకు పంపించడం జరిగింది.

## భారతీయ జనతా పార్టీ కార్గిల్ విజయ దివాస్!!!



**మచిలీపట్నం జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో గురువారం భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో కార్గిల్ విజయ దివస్ నేటితో 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాగడాల ర్యాలీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టి భారత మాతాకీ జై అని నినాదాలు చేస్తూ, కార్గిల్ యుద్ధంలో దేశం కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరుల ఆత్మ శాంతించాలని కోరుకుంటూ, శత్రు దేశమైన పాకిస్థాన్ పై విజయం సాధించిన రోజు నేటి తరాలకు తెలియజేస్తూ కోనేరు సెంటర్ నుండి నవ కల చేయాలని సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో అసువులు బాసారని, వారి పోరాట ఫలితంగా భారతదేశ కార్గిల్ యుద్ధంలో గెలుపొందిందని తెలిపారు. 25 సంవత్సరాల క్రితం పాకిస్తాన్ తీవ్రవాదులు భారతదేశంపై దండెత్తి వచ్చి యుద్ధాన్ని ప్రకటించారు. వెంటనే అప్రమత్తమైన భారత సైన్యం పాకిస్తాన్ దుశ్చర్యలను తిప్పికొడుతూ విజయం సాధించింది. విజయం సాధించిన సందర్భంగా కార్గిల్ దివస్ గా జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. నేటి తరం యువత దేశం కోసం దేశ ఔన్నత్యాన్ని పెంపొందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా యువమోర్చా కృష్ణాజిల్లా అధ్యక్షులు నాగలింగం మయోధ్య రామచంద్రరావు జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రామకృష్ణ టిడిపి అధ్యక్షులు ఇలియాస్ భాషా బిజెపి పార్లమెంట్ కన్వీనర్ గాంధీ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం గత గజేంద్ర రావు జనసేన నాయకులు గడ్డం రాజు బీజేవైఎం నాయకులు పత్తిపాటి రమణ యిర్రింకి నాగ శ్రీనివాస్ వీరమల్లు అభినందన ప్రసన్న కుమార్ ఈశ్వర్ కొత్త కిరణ్ ఘంటా సతీష్ కుమార్ మచిలీపట్నం అసెంబ్లీ కో- కన్వీనర్ శ్రీనివాస్ కునపరెడ్డి శ్రీనివాసరావు మతి వెంకటేశ్వరరావు గాయత్రి బిజెపి జనసేన టిడిపికూటమి నాయకులు పెద్ద ఎత్తునపాల్గొన్నారు

## పోలీసు కార్యాలయం లోని వివిధ విభాగాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు!!!



**మచిలీపట్నం జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణాజిల్లా ఎస్పీగా ఆర్ గంగాధర్ రావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా పోలీసు కార్యాలయంలోని విభాగాలైన ఏ సెక్షన్, బి, సి ,ఇ ,జి, పి సెక్షన్ లను స్వయంగా తనిఖీ చేసి రికార్డులు గూర్చి సెక్షన్ సూపరింటెండెంట్ లను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లలో ఉండే పోలీసు సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. అదేవిధంగా పోలీసు కార్యాలయంలోని, ఐటీ కోర్ విభాగం, తపాలా విభాగం, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో ( డిసిఆర్బి ), పోలీస్ కన్స్యూమర్ స్టోర్స్, పోలీస్ కోపరేటివ్ సొసైటీ విభాగం, స్పెషల్ బ్రాంచ్ విభాగం, డిపిఓ స్టోర్స్ విభాగాలను పరిశీలించి అక్కడ నిర్వహణ గూర్చి ఏ ఏ ఓ ని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది నిర్వర్తించాల్సిన విధివిధానాలు గూర్చి, పలుకీలక సూచనలు చేసి దిశా నిర్దేశం చేశారు సిబ్బంది అందరితో ముఖాముఖి మాట్లాడి వారు నిర్వర్తించే విధులు, విధి నిర్వహణలో ఏదైనా సమస్య పై ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్న నేరుగా తన వద్దకు స్వయంగా వచ్చి తెలియజేయవచ్చని తెలిపారు.

## శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాదు



**విజయవాడ పశ్చిమ జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయమునకు విచ్చేయగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కె ఎస్ రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీఅమ్మవారి దర్శనం కల్పించారు.అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనము చేయగా కార్యనిర్వాహణాధికారి అమ్మవారి శేషవస్త్రము, ప్రసాదము, చిత్రపటంను అందజేశారు.

## భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దే



**ఇబ్రహీంపట్నం జులై 25(వార్తా ప్రభ ప్రతినిధి):-**స్థానిక నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నాడు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మరియు కోడింగ్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. డేటా వ్యాలీ సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు కెరియర్ కౌన్సిలింగ్ అవేర్నెస్ భాగంగా ఈ సెమినార్ నిర్వహించారు. ఈ సదస్సులో డేటా వ్యాత్ టెక్నికల్ హెడ్ టి సాంబశివరావు మరియు మార్కెటింగ్ మేనేజర్ కె. సరసింహ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్తు మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్స్ మీదే ఆధారపడి ఉందని, అందులో ప్రావీణ్యం సంపాదిస్తే మంచి జీతంతో స్థిరపడవచ్చని విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అక్బర్ ఖాన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ అజయ్ మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయవాడ నగర ప్రజల సంతృప్తే ప్రధానం

- ప్రజల యోగక్షేమాలే లక్ష్యంగా పనిచేస్తా
- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఐఏఎస్




**విజయవాడ పశ్చిమ జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎం ధ్యానచంద్ర బుధవారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖాధిపతులందరూ కమిషనర్ గారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సంతృప్తే ప్రధానంగా, ప్రజల యోగక్షేమాలే లక్ష్యంగా విజయవాడ నగరపాలక సంస్థ పనిచేస్తుందని అన్నారు. నగర పరిధిలో ఉన్న 64 వార్డుల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ నిర్వహణలో జాతీయ ప్రమాణాలతో మెరుగుపడేటట్లు చూసుకుంటామని, ప్రజలకు కేవలం సురక్షితమైన త్రాగునీటినే సరఫరా చేసేటట్టు చూసుకుంటామని, సైడ్ డ్రైన్ లలో త్రాగునీటి పైప్ లైన్ లో లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటూ స్వచ్ఛమైన త్రాగునీటిని సరఫరా చేసేటట్టు చూసుకుంటామని, వాడకంలో ఉన్న నీరును కూడా సివేజ్ ట్రీట్మెంట్ ద్వారా మరింత మెరుగుపరచడానికి చర్యలు తీసుకోబోతున్నామని, నగరంలో పచ్చదనాన్ని మరింత పెంచుతామని తద్వారా కాలుష్యాన్ని నివారించడమే కాకుండా ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని కల్పించవచ్చని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వస్తున్న ప్రాజెక్టులను కూడా సంపూర్ణంగా అమలు చేసే దిశగా విజయవాడ నగరపాలక సంస్థ పనిచేస్తుందని తెలిపారు. తదుపరి బాధ్యతలు స్వీకరించిన విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎం ధ్యానచంద్ర ఐఏఎస్ కి, కార్పొరేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. తమకి శుభాకాంక్షలు అందచేయడానికి వచ్చిన ప్రతి ఒకరితో వారి పరిచయాలు తెలుసుకొని, వారికి ధన్యవాదాలు చెప్పారు.

## అన్న క్యాంటీన్ కి అన్ని వసతులు ఉండేటట్టు చర్యలు తీసుకోండి

### అధికారులకు ఆదేశాలు ఇచ్చిన విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎం ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఐఏఎస్ గురువారం తన పర్యటనలో భాగంగా సర్కిల్ 2, ధర్నా చౌక్ పక్కన గల అన్న క్యాంటీన్ ని పరిశీలించారు. అన్న క్యాంటీన్ లో అన్ని వసతులు కలిగి ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని, ఫ్లోరింగ్ ఫినిషింగ్ నాణ్యత ప్రమాణాలతో చేయాలని, త్రాగునీటి సౌకర్యాలు ప్రజలకు కల్పించాలని, అన్న క్యాంటీన్ ఆవరణలో పచ్చదనం తో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు కల్పించేటట్టు చూసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.ఈ పర్యటనలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో పాటు ఎగ్జిక్యూటివ్ జోనల్ కమిషనర్ -2 ప్రభుదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 2 శ్రీనివాసరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ 2 రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్ష ఎరువులు వాడితే అధిక దిగుబడి

### వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ తరగతులు

**ఇబ్రహీంపట్నం జులై 25(వార్తా ప్రభ ప్రతినిధి):-** ఈలపోలు గ్రామంలో గ్రామీణ విత్తనాత్మృత్తి పథకం క్రింద శిక్ష కార్యక్రమం భాగంగా జిల్లా వనరుల కేంద్రం, విజయవాడు వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అందులో భాగంగా రైతులకు 3 శిక్షనా తరగతులు ఇవ్వటం జరుగుతుందని, మొదటి శిక్షగా కార్యకమంలో భాగంగా రైతులకు విత్తనశుద్ధి (కేశవిత్తనానికి 10 గా సూడోమోనాస్ కలిపి) చేసుకోవటం వలన ఉపయోగం ఉంటుందని తెలిపారు. నారుమడులలో పాటించవల్లసిన వ్యవసాయ రక్షణ పద్ధతులు కార్బాఫ్యూరాన్ సీళికలను నారు మడిని వారం రోజుల ముందు చల్లకావటం) వలన పోలంలో కలిగే లాభాలను తెలియజేసారు. అదేవిధంగా వ్యవసాయు సాంకేతిక యాజమానని సంస్థ (ఆత్మ) వారి ఆధ్వర్యంల వాతావరణం ఆధారంగా పంటలనారు, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకంపై అవగావన కల్పించారు.ముఖ్యంగా నేలలో కర్బన పదార్థంను పెంచుకోవడానికి జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పంటలను పెంచి, కలియదున్నటం చేయటం ద్వారా వచ్యామస్ తయారయ్యి, రైతు వేసిన . రసాయన ఎరువులు మొక్కకు సంపుర్ణంగా ఉదటం జరుగుతుందన్నారు. సభగ్ర సస్వరక్షణ పద్ధతులను పాటించు కోవటం ద్వారా కూడా రైతు ఖర్చు తగ్గించుకోవచ్చు కనుక, వేప, నాగ ఆకలతో చేసిన కషాయాలను, జీవనియంత్రణ పద్ధతులైన సూడోమోనాస్ ఫ్లోరసెన్స్, ఖట్రైకోడెర్మావిరిడి వాడకంను అలవాటు చేసుకోవాలని తెలిపారు.వాతవరణ మార్పులకు అనుగుణంగా పంటల సరోజిని మర్చుకోవలసినదిగా సూచించటమైనది. ఈ కార్యక్రమంలో జిల్లావనరుల కేంద్రం డిడివి ముథవిలత, ఏడిఏ మనీషా, మండల వ్యవసాయ అధికారిని శైలజి, వాసుదేవ నాయక్ పాల్గొన్నారు.



NOTICE
IN THE HON'BLE COURT OF THE II ADDL SENIOR CIVIL JUDGE : AT VIJAYAWADA
I.P. No. 28/2023
Between :
Mareedu Syam Kumar ... Petitioner
AND
Pothuluri Nageswara Rao And others ... Respondents
To
1st Respondent :
Pothuluri NageswaraRao, S/o. Chandra iah, Hindu, Aged about 54 Years, Resident of Door No. 7-4/5, Poranki Village, Penamaluru Mandal, Krishna District.PIN-521137.
2nd Respondent :
Pothuluri Srinivas Rao, S/o.Chandraiah, Hindu, Aged about 56 Years, Resident of Door No. 7-67, Poranki Village, Penamaluru Mandal, Krishna District.PIN-521137.
The above named Petitioner filed the above Insolvency Petition against the Respondents for to Declare and adjudge the Respondent No.1 as Insolvent and for Other Reliefs and the said Petition was posted to 23-08-2024 for your appearance. You have to attend at 10.30 AM on that day before the above said Hon'ble Court in Person or through Advocate, failing which the above Petition will be decided setting you exparte.
(By Order of the Court)
N. KRISHNA MOHAN, Advocate
Jadagamvari Street
Suryaraopet, Vijayawada-2
Ph: 2432345; 9848128444
Vijayawada,
Dt. 25-07-2024

## చురకల సుర కత్తులు



జీవితంలో వ్యసనాలు
చేయించును దారుణాలు
ఆదిలోనే త్రుంచితే
బాగుపడును కుటుంబాలు
గౌరవిస్తే నమ్మకాలు
నిలుబడును కాపురాలు
సత్సంకల్పముంటేనే
సిద్ధించును ఆశయాలు
ప్రేమలేని హృదయాలు
కొడిగట్టిన దీపాలు
ఉండదు మానవత్వము
పండదు దైవత్వము
ఆశలేని మానవులు
శ్వాసలేని కాయాలు
ఉరి త్రాడుకు సమానము
గురిలేని జీవితాలు

**-గద్వాల సోమన్న**

9966414580

# గుంటుపల్లి లో అస్తిపంజరం కలకలం

**మృతుడు నేపాల్ కు చెందిన కృష్ణ మాన్ కుమార్ గా గుర్తింపు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన దర్యాప్ చేస్తున్న పోలీసులు**



**ఇబ్రహీంపట్నం జూలై 25(వార్తా ప్రభ ప్రతినిధి):**–మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామ కృష్ణా నది ఒడ్డున గల మామిడి తోటలో అస్థిపంజరం కలకలం రేపింది. ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం బెంగళూరు వాస్తవ్యులు సత్యనారాయణ గుంటుపల్లి లో ఘాట్ కృష్ణా నది ఒడ్డున గల మామిడి తోటకు కాపలాదారు ఉదయం చెట్టు కింద అస్తిపంజరం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. అస్తిపంజరానికి కొంత దూరంలో వైట్ కలర్ షర్టు, పసుపు రంగు టీ షర్ట్,బ్లూ కలర్ ప్యాంటు, ఫోన్ ఉన్నట్లు తెలుస్తోంది. మృతుడు కృష్ణ మాన్ కుమార్(46) నేపాల్ దేశానికి వ్యక్తిగా గుర్తించారు. ప్రస్తుతం కోయంబత్తూర్ లో పని చేస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నారు పోలీసులు.

# గత పాలనలో చేసిన అరాచకాలపై శ్వేత పత్రం విడుదల చేయాలి

**సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు**



**విజయవాడ జూలై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**: వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన దళిత నరమేధంపై, కబ్జాలపై, దాడులపై, సహజ వనరుల దోపిడీలపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసిపి పాలనలో దళితులపై జరిగిన నరమేదం పై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలన్న డిమాండ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ముందు ఉంచినట్టు వారు తెలిపారు. ఈ మేరకు బుధవారం గాంధీనగర్లో భారీ ర్యాలీగా వచ్చి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులు హింసకు గురయ్యారని, అనేక మంది చంపబడ్డారని, 5000 ఎకరాల అసైన్డ్ భూములను దొంగ జీవోతో రెగ్యులర్ చేసి దోచుకున్నారని, లక్షలాది ఎకరాల ఎస్సీ, ఎస్టీ భూములను లాక్కున్నారని, వేల మంది దళితులపై అక్రమ కేసులు పెట్టి హింసించారని తెలిపారు. రాక్షస పాలన చేసిన జగన్ దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఢిల్లీ వెళ్లి నిరసన చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అన్యాయాలపై అక్రమాలపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని, కారకులైన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో సమతా సైనిక్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఇక వైసీపీ నుంచి వలసలు మొదలయినట్టేనా?

**అమరావతి జూలై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలయిన సంగతి తెలిసిందే. వైనాట్ 175 అని చివరకు 11 స్థానాలకే కుదేలయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ నుంచి వలసలు మొదలయ్యాయి.తాజాగా పొన్నూరు మాజీ ఎమ్మెల్యే, ఇటీవల ఎన్నికల్లో గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన కిలారు రోశయ్య వైసీపీకి రాజీనామా చేశారు. ఈయనకు ముందు ఎన్నికల ఫలితాలు వెలువడటం ఆలస్యం.. మాజీ మంత్రి రావెల కిశోర్ బాబు వైసీపీ నుంచి తప్పుకున్నారు. రావెల టీడీపీలోకి, కిలారు జనసేన పార్టీలోకి వెళ్లనున్నారని టాక్ నడుస్తోంది.వీరే కాకుండా పెద్ద ఎత్తున వైసీపీ నేతలు పార్టీ మారడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు, అవకతవకలపై విచారణ సాగించే అవకాశం ఉండటంతో కేసుల భయం ఉన్న నేతలు పార్టీ మారే యోచనలో ఉన్నారని తెలుస్తోంది.అలాగే వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఒంటెద్దు పోకడలు, సలహాదారులపైన, సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి లాంటి ఇద్దరు, ముగ్గురుపైనే ఆధారపడటం నచ్చనివారు తమ, తమ వారసుల రాజకీయ భవిష్యత్ కోసం పార్టీ మారుతున్నారని సమాచారం.వైసీపీలో కేసులు ఉన్న నేతలు బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే ఆచితూచి వ్యవహరించాలని ఆ పార్టీ నిర్ణయించింది. అంతేకాకుండా టీడీపీ, జనసేనలతో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. కూటమిలోని మూడు పార్టీలు.. తమ పార్టీల్లో చేరాలనుకుంటున్న వైసీపీ నేతల విషయంలో కలిసికట్టుగా మాట్లాడుకుని నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించాయి.వివాదాస్పద నేతలు, బూతులు తిట్టేవారు, అవినీతి, అక్రమాల కేసులున్నవారిని ఎట్టి పరిస్థితుల్లో చేర్చుకోకూడదని నిర్ణయించినట్టు చెబుతున్నారు. ఇదే ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు అడ్డంకిగా ఉందని అంటున్నారు.తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఈ కాపు నేత ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్నారు. గతంలో నాలుగుసార్లు వివిధ పార్టీల తరఫున ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇటీవల ఎన్నికల్లో మండపేట నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆయనపై దళితులకు శిరోముండనం చేయించారనే కేసు ఉంది. ఈ కేసులో ఆయనకు శిక్ష కూడా పడింది. అయితే అది ఇంకా అమల్లోకి రాలేదు.ఈ నేపథ్యంలో ఆ కేసు నుంచి బయటపడటానికి తోట త్రిమూర్తులు బీజేపీలో చేరాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు బీజేపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ ను సంప్రదించారని చెబుతున్నారు. ఆయన కూటమి పార్టీలతో మాట్లాడి చెబుతామని త్రిమూర్తులకు చెప్పినట్టు తెలుస్తోంది.ఇక తూర్పుగోదావరి జిల్లాలోనే సీనియర్ నేత పిల్లి సుభాష్ చంద్రబోస్ కూడా పార్టీ మారే యోచనలో ఉన్నారని చెబుతున్నారు. ఆయన ప్రస్తుతం వైసీపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. జగన్ కేబినెట్ లో మంత్రిగా ఉన్న ఆయనను తప్పించి రాజ్యసభ సీటు ఇచ్చారు.పార్టీ అవిర్భావం నుంచి ఉన్న తమ కంటే కూడా చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు వైఎస్ జగన్ మద్దతు ఇస్తుండటాన్ని పిల్లి సుభాష్ చంద్రబోస్ జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు.ఇటీవల తన కుమారుడు సూర్యప్రకాశ్ కు సీటు ఇప్పించుకోవడానికి కూడా పిల్లి సుభాష్ చంద్రబోస్ పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. చివరకు సీటు దక్కించుకున్నారు. రామచంద్రాపురం నుంచి వైసీపీ తరఫున పోటీ చేసిన పిల్లి కుమారుడు సూర్యప్రకాశ్ ఓటమి పాలయ్యారు.మరోవైపు పిల్లికి కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితోనూ తీవ్ర విభేదాలు ఉన్నాయి. స్వతహాగా సుభాష్ చంద్రబోస్ సౌమ్యుడు, వివాద రహితుడు. ఈ నేపథ్యంలో ఆయన తన కుమారుడి రాజకీయ భవిష్యత్ కోసం జనసేన పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు చెబుతున్నారు.

# శ్రీ లక్ష్మీ నరసింహా స్వామీ కాలనిలోని సమస్యలను పట్టించుకునే వారే లేరా ....?

**– చలించి స్పందిస్తున్న 8ఏళ్ళ బాలుడు విశ్వజీత్ కు అభినందనలు....**

**గత 10ఏళ్ళలో బి ఆర్ ఎస్ కు నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలకు సమస్యలపై చలనం లేదు**

**– జవహర్ నగర్ బిజెవైఎం నాయకులు...**



**జవహర్ నగర్, జూలై, 25:(వార్తా ప్రభ)**శ్రీ లక్ష్మీ నరసింహా స్వామీ కాలనిలో 8 ఏళ్ళ బాలుడు విశ్వజిత్ వీడియోకు స్పందించిన బిజెపి యువ మోర్చ నాయకులు, శ్రీ లక్ష్మీ నరసింహా స్వామీ కాలనీ కమిటీ సభ్యులు గత ఐదు రోజులుగా రేవంత్ రెడ్డి తాతయ్య మా కాలనీలో రోడ్లు వెయ్యండి అంటూ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 28 వ డివిజన్ లోని శ్రీ లక్ష్మీనరసింహా కాలనీలో రెండవ తరగతి చదువుతున్న విశ్వజిత్ అనే చిన్నోడు చేసిన వీడియో,సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా కథనాల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో వైరల్ గా మారింది.ఈ రోడ్ల సమస్య రాష్ట్ర మొత్తం వైరల్ అవుతున్న కానీ, ఇక్కడ స్థానిక కార్పొరేటర్ నిహారిక గౌడ్, మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎలాంటి స్పందన లేకుండా వ్యవహరిస్తున్నారని, సమస్యపై స్పందించిన బిజెపి యువ మోర్చా నాయకులు, శ్రీ లక్ష్మీనరసింహా కాలనీ కమిటీ సభ్యులు, అతి చిన్న వయసులోనే సమస్య పరిష్కార దిశగా గత పదేళ్లుగా మల్లారెడ్డి తాత ఏం చేయలేదంటూ , కనీసం ఇప్పుడైనా రేవంత్ రెడ్డి తాతయ్య సమస్యను పరిష్కరించాలంటూ గత ప్రభుత్వాల వైఫల్యాలను ఈ చిన్నోడు తనకు తెలియకుండానే, ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, గత పది ఏళ్లుగా పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాడు.. ఏదేమైనా సరే ఈ బుడ్డోడు అడిగిన విధానాన్ని మెచ్చుకుంటూ, బీజేపీ యువ మోర్చా నాయకులు, శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి కాలనీ కమిటీ సభ్యులు విశ్వజిత్ కు అభినందనలు తెలిపారు..ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు, కాలనీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, జవహర్ నగర్ మేయర్, స్థానిక కార్పొరేటర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ అధికారులు కాలనిలో ఉన్న సమస్యలను పరిగణలోకి తీసుకొని తక్షణమే ఇక్కడ సిసి రోడ్లు,అండర్ డ్రైనేజ్, విద్యుత్ కు సంబంధించిన పనులు చేసి ప్రభుత్వ అధికారులపై , పాలకవర్గంలో ఉన్న నాయకులపై, అదేవిధంగా ఈ సమాజం పట్ల ఒక మంచి అభిప్రాయాన్ని తీసుకురావాలని కోరారు.అదే విధంగా మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి మా యువ మోర్చా నాయకుల తరఫున ఈ విషయాన్ని చేరవేసి, జవహర్ నగర్ లో సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని లేనిపక్షంలో ప్రజా భవన్ ముందు ఆందోళన చేపట్టి, రేవంత్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని చేరవేస్తామని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నరసింహా స్వామీ కాలనీ అధ్యక్షుడు కెకె చారి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రవి బిజెవైఎం నాయకులు సందీప్ ముదిరాజ్, రాహుల్ సింగ్, కాలనీ వాసులు శంకర్, శ్రీశైలం, నరేష్, మహేందర్ , నవీన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు....

# కోర్టు ఆదేశాలతో చర్చికి తాళం వేసేందుకు సిద్ధమైన అధికారులు

**రోడ్డెక్కి ప్రార్థనలు, రెండు గంటలకు పైగా ఆందోళన**



**ఇబ్రహీంపట్నం, జూలై 25 (వార్తా ప్రభ ప్రతినిధి):**– మండల పరిధిలోని ఈలప్రోలు సీఎస్ఐ చర్చి వివాదం ముదిరి పాకాన పట్టింది. సీఎస్ఐ చర్చి కాదు.. కమ్యూనిటీ హాల్ అంటూ మాజీ సర్పంచ్ మిరియాల లక్ష్మణరావు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు అధికారులు సీఎస్ఐ చర్చికి తాళం వేసి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా తమకు న్యాయం చేయాలంటూ చర్చి విశ్వాసులు గురువారం రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. కొండపల్లి – ఈలప్రోలు ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రార్థనలు చేసి, స్తుతి గీతాలు ఆలపించి నిరసన తెలిపారు. సుమారు రెండు గంటలకు పైగా రాస్తారోకో కొనసాగింది. ఈ సందర్భంగా సీఎస్ఐ విద్యానగరం డీనరీ చైర్మన్ రెవరెండ్ యు.మోహనరావు మాట్లాడుతూ విద్యా నగరం ప్యారిస్ లో ఉన్న ఈలప్రోలు సీఎస్ఐ చర్చి మరియు పాఠశాలను 150 సంవత్సరాల క్రితమే నిర్మించినట్లు తెలిపారు. విశ్వాసుల సంఖ్య పెరగడంతో సంఘస్థులు, దాతల ఆర్థిక సహకారంతో ఎంపీ నిధులతో సీఎస్ఐ స్థలంలో నూతన చర్చిని నిర్మించినట్లు చెప్పారు. అయితే మాజీ సర్పంచ్ మిరియాల లక్ష్మణరావు సంఘానికి, పాస్టర్ కు తెలియకుండా డబ్బు వసూలు చేసి, కొంత సంఘానికి ఇచ్చాడన్నారు. ఆ తరువాత ఇది చర్చి స్థలం కాదని, ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మించామని తనకు డబ్బు ఇవ్వాలని లేకుంటే కేసు పెడతానని పాస్టర్ ను బ్లాక్ మెయిల్ చేశాడని ఆరోపించారు. మాజీ సర్పంచ్ కులాలు, మతాలు అంటూ చిచ్చుపెట్టి అధికారులతో కుమ్మక్కై కోర్టును ఆశ్రయించాడన్నారు. గతంలో అధికారుల సమక్షంలో సీఎస్ఐ నుంచి రూ.3 లక్షలు తీసుకున్న లక్ష్మణరావు మళ్లీ సీఎస్ఐ చర్చి కాదని కమ్యూనిటీ హాల్ అంటూ కోర్టుకెళ్లడం సరికాదన్నారు. క్రైస్తవుల ఆత్మ గౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకే ఈ చర్చిని ఏర్పాటు చేసుకున్నామని, సంఘ విద్రోహ కార్యక్రమాలు జరగడం లేదన్నారు. అప్పుడు డబ్బు తీసుకుని ఇప్పుడు కులాల మధ్య రాజకీయ విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. అధికారులు స్పందించి చర్చికి తాళాలు వేయకుండా ప్రార్థనలు చేసుకునేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. సీఎస్ఐ విశ్వాసులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న సీఐ ఎం.సత్యనారాయణ, ఎస్సై బి.అనూష సంఘటనా స్థలానికి చేరుకుని చర్చలు జరిపారు. తమకు కొంత సమయం కావాలని విశ్వాసులు త్వరగా మండల అధికారులు అంగీకరించారు. దీంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ ఈలప్రోలు పాస్టర్ బాబురావు, పాస్టర్ ఎం.శ్యాంసుందర్, ఇబ్రహీంపట్నం మండల పాస్టర్స్ ఫెలోషిప్ మాజీ అధ్యక్షుడు పాస్టర్ డి.ప్రభుదాస్, పాస్టర్ ఎస్.సాల్మన్, పాస్టర్ నల్లమోతు ప్రసన్న, టిడిపి సీనియర్ నాయకుడు కె.అంతోని విశ్వాసులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఏపీ పి టి డి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వినతిపత్రం అందజేత



**విజయవాడ పశ్చిమ జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏ పి పి డి టి బి సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్పీ.శేషగిరిరావు ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కి గురువారం ఏపీ పిటిడి ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు.ముఖ్యంగా గతంలో ఏపీ పిటిడి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్కు బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు రీజనల్ స్థాయిలో నెలకు ఒకసారి, హెడ్ ఆఫీస్ స్థాయిలో మూడు నెలలకు ఒకసారి జాయింట్ మీటింగ్ లో ఏర్పాటు చేసి ప్రత్యేకంగా బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంస్థ తరఫున సహకారం అందించేవారు. అయితే ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాతఈ జాయింట్ మీటింగ్లను రద్దు చేయడం జరిగిందిని మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ జాయింట్ మీటింగ్లను పునరుద్ధరించవలసిందిగా కోరారు. మంత్రి స్పందిస్తూ వినతిపత్రం పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే త్వరలో ఏపీ పి.టి.డి లోని అన్ని అసోసియేషన్ లతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కరనికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సభ్యులు వి.జె.రత్నం, ఎం.తిరుపతిరావు, పి. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి సందర్భంగా వందలాది మంది కి అన్నదానం



**విజయవాడ పశ్చిమ జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సాయిబాబా సేవసమితి వారి ఆధ్వర్యంలో చిట్టినగర్, జ్యోతిశ్వరరావు హాస్పిటల్ వద్ద గురుపౌర్ణమిని పురస్కరించుకొని గురువారం అన్నదానం కార్యక్రమంనిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిధిగా ఇల్లిపిల్లి జ్యోతిశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. మరియు సేవసమితి సభ్యులందరు పాల్గొన్ని వేలమంది సాయిబాబా భక్తులకు అన్నవిత్తరణ చేయడము జరిగింది.

# భవానీపురం రైతు బజార్ నుండి శ్రీ కనకదుర్గమ్మ కి ఆషాడ మాసం సారె



**విజయవాడ పశ్చిమ జులై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భవానిపురం రైతు బజార్ నందు రైతు బజార్ వర్తక సంఘం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మలగన్న అమ్మ బెజవాడ కనకదుర్గమ్మ కు ఆషాఢ మాసం సారె సమర్పించారు.రైతు బజార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆషాడం సారె ను గత 3సంవత్సరాలుగా ఆనవాయితీగా సమర్పించడం జరుగుతుంది. అదేవిధంగా ఈ సంవత్సరం కూడా 4వ సారి ఘనంగా డబ్బులు వాయిద్యాలతో అన్ని రకాల సారెను రైతు బజార్ వర్తక సంఘం మరియు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఊరేగింపుగా బయలుదేరి కాలి నడకన వెళ్లి గురువారం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా రైతు బజార్లో ఉన్నటువంటి అమ్మవారిని వారి వ్యాపారాలు బాగుండాలని, అందరూ బాగుండాలని రైతు బజార్ అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకుంటూ పూజలు నిర్వహించడం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో రైతు బజార్ వర్తక సంఘం కమిటీ వారు వినియోగదారులు వర్తకులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

# పాల వంటి స్వచ్ఛమైన మనసు మన శ్రీనివాసరావుది



**, విస్సన్నపేట జూలై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పాల వంటి స్వచ్ఛమైన మనసు కలిగిన పయ్యావుల శ్రీనివాసరావు 24 సంవత్సరాలుగా నరసాపురం పాల కేంద్రంలో పాలు సేకరిస్తూ సేవలందిస్తున్నారని ఆయన అకాల మరణం దురదృష్టకరమని క్లస్టర్ మేనేజర్ డి సాంబశివమూర్తి అన్నారు, ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం ఆర్థిక చేయూత అందించారు. తిరువూరు కస్తూరి పరిధిలో కృష్ణ మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో నడిచే నరసాపురం పాల కేంద్రానికి వెలకట్టలేని సేవలందించారన్నారు. సంఘ నిధుల నుండి 25 వేల రూపాయలు కృష్ణ మిల్క్ యూనియన్ తరపున 25 వేల రూపాయలు విస్సన్నపేట చాట్రాయి పరిధిలోని సంఘాల వేతన కార్యదర్శుల సహాయ సహకారాలతో 32,500 మొత్తం 82,500 శ్రీనివాస్ కుమార్తె సాయి రమ్యకు చెక్కు రూపంలో అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రస్ట్ బోర్డు సభ్యులు పి సత్యనారాయణ ఎం విజయలక్ష్మి సంఘ అధ్యక్షురాలు అనసూయ తదితరులు పాల్గొన్నారు. చెక్కు అందుకున్న సాయి రమ్య కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ తో పాటు తమకు వితరణ అందించిన వారందరికీ అంతఃకరణ శుద్ధిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆమె చెప్పారు.

# నాటి అమ్మ ఒడి నేటి తల్లికి వందనం సొమ్ము అందితే బాగుండేది

**ఎంపీపీ పిఎం వనజాక్షి రాజేష్**




**. విస్సన్నపేట జూలై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నాటి అమ్మ ఒడి నేటి తల్లికి వందనం కార్యక్రమం గా రూపాంతరం చెందిన 15 వేల రూపాయలు పంపిణీ కార్యక్రమం పేద ఇంటి ఆడపడుచులకు పాఠశాలల ప్రారంభంలో ఇచ్చి ఉంటే భరోసాగా ఉండేదని ఎంపీపీ పిఎం వనజాక్షి రాజేష్ తెలియజేశారు. ఇప్పటికే అర్హత ఉన్న వారికి ఇస్తూ గతంలో ఫోర్ వీలర్స్ విద్యుత్ బిల్లు తదితరాల వల్ల కార్డు కోల్పోయిన వారికి ఎంక్వయిరీ చేసి ఇచ్చి ఉంటే బాగుండేదని ఆమె చెప్పారు. కొత్త వారి కొరకు పాతవారిని కూడా ఆపడం వలన పిల్లల బంగారు భవిష్యత్తుకు ఆర్థిక భరోసా లేకుండా అయిందని ఆమె తెలిపారు.

# ప్రముఖుల దీవెనలు అందుకున్న చిరంజీవి రాహుల్



**. విస్సన్నపేట జూలై 25 :(వార్తా ప్రభ ప్రతినిధి )**స్థానిక కమ్మ సేవా సమితి కళ్యాణ మండపంలో చిరంజీవి రాహుల్ కు పంచ కట్టు వేడుక కార్యక్రమంలో భాగంగా టిడిపి బిజెపి జనసేన పార్టీల నాయకులు పలు విద్యాసంస్థలు వ్యాపార సంస్థల అధినేతలు తమ ఆశీస్సులు అందించారు. ల్యాండ్ లార్డ్ ఎన్ టి వెంకటేశ్వరరావు మనవడు చైతన్య ఆర్థోకేర్ డాక్టర్ ఎన్ చైతన్య మేనల్లుడు రాహుల్ కు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మట్టా వేణుగోపాలరావు సీనియర్ టిడిపి వైసిపి నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు( బద్దే మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి (సూరి రెడ్డి) ఎన్ ఆర్ఐ గిరి, వికాస్ విద్యాసంస్థల అధినేత నరెడ్ల నర్సిరెడ్డి, శ్రీ సిద్ధార్థ విద్యా సంస్థల అధినేత మేడా మోహనరావు ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు గంధం సత్య శ్రీ హనుమంతరావు, దామోదర రెడ్డి భారతీయ జనతా పార్టీ తిరువూరు నియోజకవర్గ కన్వీనర్ పెనుగొండ రామచంద్రరావు మండల బిజెపి అధ్యక్షురాలు సుమ టిడిపి సీనియర్ నాయకులు ఎన్టీఆర్ జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నెక్కలపు శ్రీనివాసరావు అలియాస్ దాబా శ్రీను, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు కే రాజా టిడిపి జిల్లా నాయకులు రాయల సుబ్బారావు తెలుగు యువత ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వాహ కార్యదర్శి తుమ్మలపల్లి అనిల్ వైభవ్ జ్యువలరీ అధినేత కుక్కడపు వెంకట నాగేశ్వరరావు, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు మర్రి బోయిన వెంకటేశ్వరరావు( చిన్నోడు) కంభంపాటి బద్రీనాథ్, శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి వారి ఆలయ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ కే శ్యాంప్రసాద్ లాయర్ ముత్య ప్రసాద్ టిడిపి యువ నాయకులు మాగంటి బాబి మురుగుల ప్రసాద్ వడ్లమూడి చంటి కిలారి అప్పారావు జనసేన నాయకులు నందమూరి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు

# వంధ్యత్వం పై విస్తృత ప్రచారం అవసరం

● దేశంలో 28 మిలియన్ల జంటల్లో సంతానోత్పత్తి సమస్యలు ● ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్. సి. జ్యోతి ●'మ్యాజిక్ ఆఫ్ హోప్' పేరుతో ఫెర్టీ9 ట్యూన్ పరిచయం ● ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా 'టుగెథర్ ఇన్ ఐవీఎఫ్ ప్రచారం





**హైదరాబాద్,జులై 25 (వార్తాప్రభ) :** భారతదేశంలో దాదాపు 28 మిలియన్ల జంటలు సంతానోత్పత్తి సమస్యలను ఎదుర్కొంటున్నారని, నిశ్చల జీవనశైలి, పెరుగుతున్న ఒత్తిడి స్థాయిలు, ఊబకాయం, ఇతర వైద్య పరిస్థితులు వంటి కారణాల వల్ల ఈ సంఖ్య పెరుగుతోందని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్. సి. జ్యోతి అన్నారు. వంధ్యత్వం అనేది పిల్లలు కనలేని స్థితి. కొన్ని జంటలు ఈ సమస్య కారణంగా శారీరకంగా, మానసికంగా చాలా క్షోభని అనుభవిస్తారని అన్నారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని ప్రతి ఏటా ఘనంగా జరుపుకోవడానికి ప్రధాన కారణం స్త్రీ, పురుషులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతోనే జరుపుకుంటున్నామన్నారు. ఒకవేళ ఇద్దరికీ ఎలాంటి చెడు అలవాట్లు ఉన్నా ఇలాంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కలిగి సమస్య నుంచి బయటపడేందుకు చక్కని మార్గంలా ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. జంటలు ఒకరినొకరు నిందించుకోకుండా సమస్యను సానుకూల దృష్టితో చూసే అవకాశం, అవగాహన ఏర్పడుతుందని, చక్కటి కుటుంబం కోసం జంటలు కొన్ని విషయాల్లో జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యకు చెక్ పెట్టడమేగాక ఆనందమయ జీవితాన్ని సొంతం చేసుకోవచ్చని చెప్పారు. గురువారం సికింద్రాబాద్ ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ ప్రాంగణంలో ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ సి ఈ ఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినీష్ గాడియా తో కలిసి డాక్టర్. జ్యోతి మాట్లాడారు. సంతానలేమి పట్ల ప్రజల్లో అవగాహనా పెరగాల్సిన అవసరం ఉందని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్. జ్యోతి అన్నారు. సంతానలేమిని ఎదుర్కొంటున్న వారి పట్ల అవగాహన పెంపొందించడానికి, మద్దతును పెంపొందించడానికి మా నిబద్ధతను సూచిస్తుందని చెప్పారు. హైదరాబాద్ ఫెర్టీ 9 ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం కోసం ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. 2024 ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం సందర్భంగా ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్. జ్యోతి సి. బుడి మీడియానుద్దేశించి మాట్లాడుతూ ఫెర్టీ 9 ప్రారంభించిన అవగాహన ప్రచారం యొక్క లక్ష్యాలు, వంధ్యత్వం, ఐవిఎఫ్ చికిత్సలను గుర్తించడం యొక్క ప్రాముఖ్యత అన్నారు. వీధి నాటకాలు, ఇతర కార్యకలాపాల ద్వారా వంధ్యత్వం ఐవిఎఫ్ చికిత్సల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి విస్తృత స్థాయి అవగాహన ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వంధ్యత్వంతో బాధపడుతున్న వారికి 'మ్యాజిక్ ఆఫ్ హోప్' పేరుతో ఫెర్టీ9 ట్యూన్ పరిచయం చేస్తున్నామన్నారు. ముఖ్యంగా సంతానోత్పత్తి చికిత్సలు చేయించుకుంటున్న జంటలకు ఆశ కల్పించేలా సంగీత భాగాన్ని కంపోజ్ చేశారు. టుగెథర్ ఇన్ ఐవీఎఫ్ ప్రచారం ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణా లో వీధి నాటకాల ద్వారా సంతానలేమి, ఐవీఎఫ్ చికిత్సల గురించి అవగాహన పెంచడానికి రూపొందించబడిందన్నారు. భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో వంధ్యత్వం అనేది సమస్యగా మారిందని, ఈ ప్రచారం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచి ఐవీఎఫ్ ని మరింత అందుబాటులోకి తీసుకురావడం, అర్థం చేసుకోవడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

**ధర్మ థియేటర్ అకాడమీతో భాగస్వామ్యం :** ఫెర్టీ9 ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణా అంతటా 16 ప్రదేశాలలో వీధి నాటకాలను నిర్వహించడానికి ధర్మ థియేటర్ అకాడమీతో భాగస్వామ్యులయ్యారు. రోహిత్ రాజ్ ఆకుల దర్శకత్వం వహించిన ఈ నాటకాలు, వంధ్యత్వంపై వెలుగునిచ్చేందుకు, ఐవిఎఫ్ తో సంబంధం ఉన్న కళంకాన్ని తొలగించడానికి నిజ జీవిత పరిస్థితులను వర్ణిస్తాయి. మిస్టర్ రోహిత్ మాట్లాడుతూ భాగస్వామ్యం, భావన, లక్ష్యాలు ఈ వినూత్న ప్రచారంలో ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ తో కలిసి క్లిష్టమైన సంభాషణలను తెరపైకి తీసుకురావడానికి వీధి నాటకాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేస్తామని చెప్పారు. ధర్మ థియేటర్ అకాడమీ ద్వారా దర్శకత్వం వహించిన వీధి నాటకాలు, వంధ్యత్వంతో పోరాడుతున్న జంటలు ఎదుర్కొంటున్న నిజ జీవిత పరిస్థితులను వర్ణిస్తాయన్నారు. ఈ ప్రదర్శనలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికి రూపొందించబడ్డాయని వివరించారు.

**ఫెర్టీ 9 ట్యూన్ ప్రారంభం:** ఫెర్టీ 'మ్యాజిక్ ఆఫ్ హోప్'ని పరిచయం చేయడానికి ఉత్సాహంగా ఉంది. ఇది మా యాజమాన్యంలోని ఐ పి ప్రచార థీమ్ గా ఉపయోగపడుతుంది. ఇది సంతానోత్పత్తి చికిత్సలు చేయించుకుంటున్న జంటలకు ఆశ, మద్దతు సూచిస్తుంది. వంధ్యత్వంతో పోరాడుతున్న అనేక జంటల జీవితాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. ఈ ప్రయాణంలో అవగాహన పెరగడానికి, ఒకరికొకరు మద్దతు ఇవ్వడానికి దోహదమవుతుంది.

## పల్లె బడులు కాపాడాలి-సోలా రాఘవ రాజు

● ఉన్నత పాఠశాలల్లో రెండు మీడియం లు ఉండాలి-పాడిబండ్ల భాస్కరరావు

● పి ఆర్ టి యు మండల కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం






**జి.కొండూరు,జులై 25 (వార్తాప్రభ) :** పల్లె బడులు కాపాడాలని పి ఆర్ టి యు ఎన్టీఆర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోలా రాఘవ రాజు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పి ఆర్ టి యు మండల సర్వసభ్య సమావేశం జరిగినది. పాడిబండ్ల భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాఘవరాజు మాట్లాడుతూ వన్ 117 ను రద్దు చేయాలని,మంత్లీ ప్రమోషన్స్ వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు పాడిబండ్ల భాస్కర్ రావు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో రెండు మీడియంలు ఉండాలని కోరారు. అనంతరం పి ఆర్ టి యు జి.కొండూరు మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పిఆర్టియు అధ్యక్షులుగా నెమలి పురి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శిగా పజ్జూరు శ్రీనివాసరావు,గురు అధ్యక్షులుగా పాటిబండ్ల భాస్కరరావు, మహిళా కార్యదర్శిగా గుంటూరు కిరణ్ కుమారి, జిల్లా కౌన్సిలర్ గా సంధిపాము లిల్లీ, పి. మేరి స్వర్ణలత, దొండపాటి ప్రభాకర్, సహాధ్యక్షులుగా పజ్జూరు కొండలరావు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

## హాస్టల్ విద్యార్థులకు కొండంత అండగా రాయపూడి వేణుగోపాల్ రావు



**అవనిగడ్డ,జులై 25 (వార్తాప్రభ) :** అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని హాస్టల్ విద్యార్థులకు ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన పార్టీ అధికారప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ రావు కొండంత అండగా నిలిచారు. పలు ప్రజాసమస్యలపై గళమెత్తడంతో పాటు అవిశ్రాంత పోరాటం చేసి పరిష్కరింపచేయడంలో తనదైనశైలిని ఏర్పరుచుకుని నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేసిన రాయపూడి వసతిగృహాల బాట పట్టడంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్ళలో మౌళిక సదుపాయాల కల్పన, నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయించడమే ప్రధాన అజెండాగా రాయపూడి వసతిగృహాలను సందర్శిస్తున్నారు. ఈక్రమంలో గురువారం మోపిదేవి లోని మత్స్యకార బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులు, సిబ్బందిని అడిగి పలు విషయాలు తెలుసుకున్నారు. ఆహర పదార్థాలను, పరిసరాలను పరిశీలించి ఇన్వర్టర్ కనెక్షన్ ఇవ్వకపోవడం, కొన్ని ఫ్యానులు పనిచేయకపోవడం, డైనింగ్ హాల్, లేకపోవడం అదనపు బాత్రూమ్ ల నిర్మాణం , లైబ్రరీ ఏర్పాటు తదితర సమస్యలను గుర్తించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుర్తించిన సమస్యలను స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి ఆయన ద్వారా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సహకారంతో పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని దార్శనికత, అనుభవంగల స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నాయకత్వంలో నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని రాయపూడి వేణుగోపాల్ రావు వ్యక్తం చేశారు.

## కీర్తిశేషులు పుట్ట రమేష్ గౌడ్ ఘన నివాళులర్పించిన బీసీ నేత బీసీ నేత భేరి



**హైదరాబాద్, జులై 25 (వార్తాప్రభ) :** శేరిలింగంపల్లి, చందానగర్ గీతా థియేటర్ పక్కన సప్తపది క్రిస్టల్ గార్డెన్స్ లో కీర్తిశేషులు పుట్టా రమేష్ గౌడ్ ద్వాదశ దినకర్మ కార్యక్రమాల్లో బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ పాల్గొని ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ రిటైర్డ్ మార్కెటింగ్ అసిస్టెంట్ (విజయ డైరీ) కీర్తిశేషులు పుట్టా రమేష్ గౌడ్ ఆత్మీయత గల వ్యక్తి అని, అందరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకునే వ్యక్తి అని, దయగల మనిషి అని, నిష్కల్మషమైన వ్యక్తి అని, నీతి నిజాయితీకి నిలువుటద్దమని, మంచి మనిషి అనడానికి నిదర్శనమని అలాంటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. ఆయన మృతి తీరనిలోటు అని అన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ ఆ భగవంతుడిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ నగర్ కాలనీ గౌరవాధ్యక్షులు నరసింహ యాదవ్, ఉపాధ్యక్షులు రాయుడు, మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రద్ధాంజలి తెలిపారు.

## అనుమతి లేని ఫ్లెక్సీలు తొలగించండి

● సెప్టెంబర్ కల్లా ఫ్లెక్సీ ఫ్రీ సిటీ లక్ష్యం: కమిషనర్ భావన ఆదేశం




**కాకినాడ,జులై 25 (వార్తాప్రభ) :** అనుమతి లేని ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతా వారోత్సవాలలో భాగంగా వెంకట్ నగర్ లోని సురేష్ చికెన్ సెంటర్ నుంచి సాయిబాబా ఆలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ భావన ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ నగరపాలక సంస్థ అనుమతి లేని ఫ్లెక్సీలు అన్నింటినీ తక్షణమే తొలగించాలని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. అనుమతి లేని ఫ్లెక్సీలు,బ్యానర్లు, హోల్డింగ్లను తొలగించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కోరారు. అనుమతి లేని ఫ్లెక్సీలను తొలగించడం ద్వారా సెప్టెంబర్ నాటికల్లా కాకినాడను %-%ఫ్లెక్సీ ఫ్రీ సిటీ గా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగర సుందరీకరణను దృష్టిలో ఉంచుకొని ఆయా వ్యాపార సంస్థలు నగరపాలక సంస్థకు సహకరించి అనుమతి లేని ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. అలా తొలగించని పక్షంలో నగరపాలక సంస్థ తరపున తొలగించి వాటిని ఏర్పాటు చేసిన సంస్థలపై తగిన చర్య తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనుమతి లేని ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట ఎంహెచ్ఓ డా.పృథ్వీ చరణ్, ఏసీపీ నాగశాస్త్రులు,శానిటరీ సూపర్వైజర్ రాంబాబు,పలువురు బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## ప్రైవేట్ భవనాలలో ఉన్న సచివాలయాలకు నూతన బిల్డింగ్ ఏర్పాటు చేయండి

● ప్రజా సంఘాల కన్వీనర్ ఆవులయ్య విజ్ఞప్తి.








**గిద్దలూరు,జులై 25 (వార్తాప్రభ) :** ప్రకాశం జిల్లా గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులకు గాను మొత్తం పది సచివాలయాలు ఉన్నాయి. ఇందులో చాలా సచివాలయాలు ప్రైవేటు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. ఈ సందర్భంగా ప్రజా సంఘాల కన్వీనర్ ఆవులయ్య మాట్లాడుతూ గిద్దలూరు నగర పంచాయతి పరిధిలో మొత్తం 10 సచివాలయాలలో 9 సచివాలయాలు ప్రైవేట్ భవనాలలో నడుస్తున్నాయని ముఖ్యంగా గణేష్ నగర్, ఏబీఎన్ పాలెం పరిది లోని సచివాలయాలు స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద మూడవ అంతస్తులో ఉందని దీనివలన వృద్ధులు ,మహిళలు పనులకు వచ్చినప్పుడు ముఖ్యంగా నిండు గర్భిణీలు , బాలింతలు వ్యాక్సిన్ కొరకు వచ్చినప్పుడు మూడవ అంతస్తు ఎక్కలేక తీవ్రమైన ఇబ్బందులు గురవుతున్నారు మరియు కొన్ని ప్రైవేటు అద్దె భవనాలలో ఉన్న సచివాలయాలో మౌలిక వసతులు నీటి సదుపాయాలు వంటివి కూడా సరిగా లేవని కావున స్థానిక మండల తాసిల్దార్ కార్యాలయ పాత భవనంలో మరియు నగర పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీగా ఉన్న ప్రాథమిక పాఠశాల భవనంలో నల్ల బండ సచివాలయం గణేష్ నగర్, ఏబీఎన్ పాలెం, కోటగడ్డ సచివాలయం ,క్లబ్ రోడ్డు సచివాలయాలను ఏర్పాటు చేయవచ్చని గత ప్రభుత్వ హయాంలో ఉన్న కలెక్టర్, శాసనసభ్యులు పాత ఎంఆర్ఓ ఆఫీస్ లో సచివాలయాలు ఏర్పాటుకు పరిశీలించారని ప్రస్తుత అధికారులు, పాలకులు కూడా స్పందించి ప్రజాధనం వృధా కాకుండా అద్దె భవనాలలో ఉన్న సచివాలయాలను ప్రభుత్వ భవనాలలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## ఎస్ వి వైద్య కళాశాలలో ఘనంగా 64 వ వ్యవస్థాపక దినోత్సవం





**తిరుపతి,జులై 25 (వార్తాప్రభ) :** ఎస్ వి వైద్య కళాశాలలో గురువారం 64 వ వ్యవస్థాపక దినోత్సవంను ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఎస్ వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ ట్లాడుతూ ఈ కళాశాలలో చదువుకున్న ప్రతి వైద్య విద్యార్థి దేశ విదేశాల్లో గొప్ప వైద్య సేవలు అందిస్తూ, ఈ కళాశాలకు ఎంతో వన్నె తెచ్చి పెట్టారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డే ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, పంపించిన సందేశాన్ని చదివి అందరికీ వినిపించారు. అందులో ముఖ్యంగా వైద్యానికి, వైద్య విద్యకు ఎనలేని సేవలు అందిస్తున్న వైద్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపి, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు, వైద్యానికి, వైద్య విద్యకు, వైద్య పరిశోధనలకు, పెద్దపీట వేస్తున్నట్టు, ఈ సందర్భంగా వైద్య శాఖ మంత్రి పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో1964 బ్యాచ్ కి సంబంధించిన వైద్యాధికారులు డాక్టర్ ప్రేమానంద , ధూమపానం,శ్వాసకోస వ్యాధుల్లో వస్తున్న ఇబ్బందులు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో వైద్యులకు,వైద్య విద్యార్థులకు, వైద్య సిబ్బందికి క్లుప్తంగా వివరించారు. వైద్య కళాశాలలో ఆనాడు చదువుకున్న జ్ఞాపకాలను అందరితో పంచుకున్నారు. తర్వాత వైద్య కళాశాల ప్రాంగణంలో వైద్యుల కొరకు ఫ్యాకల్టీ క్లబ్ ను పునర్నిర్మానించడం, ప్రారంభించడంజరిగినది. వైద్య కళాశాల ప్రాంగణంలో వివిధ రకాలైన చెట్లను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి ఇంచార్జ్ సూపర్డెంట్ డాక్టర్ రాధా, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్, డాక్టర్ డి.ఎస్ మూర్తి, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారధి రెడ్డి, డాక్టర్ శీనయ్య, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ చలపతి రెడ్డి, డాక్టర్ హరిబాబు, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ పాహీం, ఏపీ ఎన్జీవోస్ పట్టణ అధ్యక్షులు సురేష్ బాబు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏటుకూరి గిరి బాబు, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్, వైద్యులు వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది, మరియు ఎస్ వి వైద్య కళాశాల పి ఆర్ ఓ.వీర కిరణ్ పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబును కలిసి సీపీఎం నేతలు



**అమరావతి,జులై 25 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సీపీఎం నేతలు కలిశారు. సచివాలయంలో గురువారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి డి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు యం.ఏ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబురావు, కె ప్రభాకర్ రెడ్డి కలిసి ఎన్నికల్లో ఘన విజయం సాధించడంపై సీఎంకు అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన మేరకు మెగా డీఎస్సీ ప్రకటించి 16,347 పోస్టుల భర్తీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు నిర్ణయం, పెన్షన్లు రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంపు, త్వరలో అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణనపై సంతకాలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం నుండి రాష్ట్రానికి విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు సాధించాలని సీఎంను కోరారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యం ఇవ్వాలని, పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేయడంతో పాటు మౌళిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించాలన్నారు.

## నామినేటెడ్ పదవులపై కూటమి నాయకుల మధ్య కుదిరిన ఒప్పందం

● శాసనసభ్యుడిని ప్రసన్నం చేసుకునేందుకు నాయకుల తంటాలు

● పెరుగుతున్న పోటీని చూసి తల పట్టుకుంటున్న ఎమ్మెల్యే కాగిత



**పెడన,జులై 25 (వార్తాప్రభ) :** నామినేటెడ్ పోస్టుల వ్యవహారానికి సంబంధించి కూటమి పార్టీల మధ్య ఎట్టకేలకు ఒప్పందం కుదిరింది. టిడిపి బిజెపి జనసేన కూటమి పార్టీలుగా చలామణి అవుతున్నాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని విజయాన్ని సాధించిన కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల మీద దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఏ పార్టీకి ఎంత శాతం పదవులు అనే విషయంలో మూడు పార్టీల మధ్య ఒక క్లారిటీ వచ్చింది. ఆయా పార్టీల శాసనసభ్యులు ఉన్నచోట 60 శాతం పదవులు వారికే కట్టబెట్టి విధంగా నిర్ణయం తీసుకున్నారు. టిడిపి శాసనసభ్యులు ఉన్నచోట 60 శాతం పదవులు ఆ పార్టీకి జనసేనకు 30 శాతం బిజెపికి 10 శాతం పదవులను కట్టబెట్టే విధంగా కూటమి నాయకులు తీసుకున్న నిర్ణయం ఆయా నియోజకవర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులను గుర్తించే పనిలో ఆ పార్టీలు బిజీ అయ్యాయి. గత ఐదు సంవత్సరాల పనితీరును టిడిపి బేరీజు వేసుకుంటూ ఉండంగా జనసేన మాత్రం 10 సంవత్సరాల కాలపరిమితిని పరిగణలోకి తీసుకుంటుంది. వైసిపి ప్రభుత్వ హయాంలో కేసులు ఎదుర్కొన్న నాయకులుకు జనసేన పార్టీలో నామినేటెడ్ పోస్టుల విషయంలో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ మేరకు ఆ పార్టీ అగ్రనాయకత్వం వివరాలు సేకరించడం ప్రారంభించింది.. టిడిపి విషయానికి వస్తే స్థానిక శాసనసభ్యుడు ఆశీస్సులు ఉన్నవారికి పదవులు అన్న విషయంలో ఎలాంటి సందేహం ఉండదు. ఆమేరకు నాయకులు శాసనసభ్యులను ప్రసన్నం చేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. పెడన నియోజకవర్గానికి సంబంధించి ఉన్న రెండు మార్కెట్ యార్డులపై నాయకులు కన్నేసి ఉంచారు. బంటుమిల్లి యార్డు మీద కంటే పెడన యార్డు పై నాయకులు ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. ఆరడజను మంది పైగా దీని మీద కన్నేసి ఉంచారు. మరో విషయం ఏమిటంటే రెండు యార్డ్ పదవులను జనసేన పార్టీ నాయకులు కూడా ఆశిస్తున్నారు. టీడీపీ విజయం పార్టీ ఎంతో కష్టపడ్డాం. ఒక యార్డ్ పదవి మాకు ఎందుకు ఇవ్వరు అనేది జనసైనికుల ప్రశ్న. కూటమి నాయకుల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా హై కమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. ఆయా పదవుల మీద నాయకులు మధ్య పెరుగుతున్న పోటీని చూసి స్థానిక శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ కూడా తల పట్టుకుంటున్నారు

## అమరావతికి ఇచ్చే ఆర్థిక సాయం మొత్తాన్ని గ్రాంట్‌గా మార్చాలి

● పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**విజయవాడ,జులై 25 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం ఇచ్చే ఆర్థిక సాయం మొత్తాన్ని గ్రాంట్‌గా మార్చాలని, పోలవరం నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర విభజనతో ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ కారణాలతో అభివృద్ధికి నోచుకోని అమరావతి రాజధాని నిర్మాణం కోసం 15వేల కోట్ల రూపాయలు రుణం ఇప్పిస్తామని కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనటాన్ని ఆక్షేపించారు. రాజధాని నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న రూ.15వేల కోట్లు కేంద్ర గ్రాంట్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పుల్లో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు ద్వారా మళ్లీ రుణభారం మోపటం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందనగా ఉందన్నారు. రుణాలు ఇప్పిస్తాం అనటాన్ని రాష్ట్ర ప్రజలు దీన్ని సమర్థించరని స్పష్టం చేశారు. అలాగే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో నిర్వాసితులకు పరిహారంపై కేంద్రం స్పష్టత ఇవ్వక పోవటంతో వారు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. నిర్వాసితులకు నిర్వాసితులకు కేంద్రమే రూ.30 వేల కోట్లు గ్రాంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి రుణభారాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై మోపటం దుర్మార్గం అన్నారు. మోదీ ప్రభుత్వం పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పూర్తి బాధ్యత కేంద్రం తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# పట్టణ సుందరీకరణపై గుడివాడలో పర్యటించిన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ప్లానింగ్ & ఆర్కిటెక్చర్ నిపుణులు

● పట్టణ సుందరీకరణ మరియు గ్రీనరీపై పలు ప్రతిపాదనలు రూపొందించిన.. నిపుణుల బృందం





**గుడివాడ,జూలై 25 (వార్తాప్రభ) :** విజయవాడకు చెందిన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నిపుణుల బృందం.. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆహ్వానం మేరకు గుడివాడ పట్టణంలో పర్యటించారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రామబ్రహ్మం పార్క్, గుడివాడ పురపాలక సంఘ కార్యాలయ సెంటర్ ఏరియా తదితర ప్రాంతాల్లో, మున్సిపల్ అధికారులతో నిపుణుల బృందం పర్యటించారు. అనంతరం పురపాలక సంఘ భవనాలు మరియు నాగవరప్పాడు నుండి బస్టాండ్ సెంటర్ వరకు ఉన్న సెంట్రల్ డివైడర్ పై నిపుణుల బృంద సభ్యులు సర్వే నిర్వహించారు. అనంతరం పట్టణ సుందరీకరణకు తీసుకోవలసిన చర్యలపై బృంద సభ్యులు.. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బాలసుబ్రమణ్యంకు టౌన్ మ్యాప్ ద్వారా వివరించారు. ఆర్కిటెక్చర్ నిపుణుల బృందం పర్యటన వివరాలను మున్సిపల్ ఇంజనీర్ బి.విజయదుర్గ మీడియాకు తెలియజేశారు. గుడివాడ అభివృద్ధికి శాసనసభ్యులు వెనిగండ్ల రాము తీసుకుంటున్న చర్యలలో భాగంగా.. నిపుణుల బృందం గుడివాడలో పర్యటించిందన్నారు. పట్టణ సుందరీకరణ మరియు గ్రీనరీపై బృంద సభ్యులు పలు ప్రతిపాదనలు రూపొందించినట్లు ఇంజనీర్ విజయదుర్గ తెలియచేశారు. ప్రధానంగా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న చింతల కాలువ డ్రెన్ పై కవర్స్ స్లాబ్ లను ఏర్పాటు చేసి.. అక్కడ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు. మరియు స్వతంత్ర సమరయోధుల విగ్రహాల ఏర్పాటుకు బృంద సభ్యులు పూర్తిస్థాయిలో పరిశీలించినట్లు ఇంజనీర్ చెప్పారు. నిపుణుల బృంద సభ్యులు అందించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని.. నిధుల విడుదలను బట్టి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధి పనులు జరుగుతాయని మున్సిపల్ డి ఈ ప్రవీణ్ మీడియాకు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దు శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రమణ్యం మరియు ఆర్కిటెక్చర్ నిపుణుల బృందం, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుడివాడ జనసేన పార్టీలో పెద్ద ఎత్తున మహిళలు, యువత చేరికలు



**గుడివాడ,జూలై 25 (వార్తాప్రభ) :** స్థానిక జనసేన పార్టీ, గుడివాడ నియోజకవర్గం ఆఫీస్ నందు 8, 10 వార్డుల నుండి బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరికలు జరిగాయి. 8వ వార్డు అధ్యక్షుడు సగ్గ సత్యనారాయణ, పడాల పూర్ణ, 10వ వార్డు అధ్యక్షుడు సుంకర వెంకట్ సమక్షంలో మహిళలు, పెద్ద ఎత్తున యువత చేరారు. ఈ సందర్భంగా బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయిన తర్వాత జనసేన పార్టీలో సుమారు 30 మంది మహిళలు, యువత చేరటం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. 8వ వార్డు నుండి తోట వెంకటేష్, తోట కిరణ్ కుమార్, సంపర సాయి, దుద్దకూరు నాగ సతీష్, కాగిత సాయి, 10వ వార్డు నుండి గుడివాడ నందు, కునాపరెడ్డి పద్మ, నందేటి సురేష్, మన్యం వెంకన్న, రెడ్డి దుర్గాప్రసాద్, సునీల్, నేరెళ్ల రమేష్ తదితరులు పార్టీ లో చేరినారు. నాయకులు అందరూ కూడా జనసేన పార్టీ వార్డు స్థాయి మరియు గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలనీ కోరారు. కార్యకర్తలు అందరూ కూడా సమైక్యంగా పనిచేసే పార్టీ అభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, బుడమ రాజు, సాయి పవన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లు అర్జున్‌కు కౌంటరిచ్చిన సొంత తమ్ముడు




మెగా ఫ్యామిలీకి ధీటుగా అల్లు ఫ్యామిలీ నుంచి కూడా హీరోలు వచ్చిన సంగతి తెలిసిందే. అల్లు ఫ్యామిలీ నుంచి వచ్చిన అర్జున్ స్టార్ హీరోగా ఎదిగి, తనకంటూ ప్రత్యేకంగా అభిమానులను సొంతం చేసుకున్నారు. అల్లు అర్జున్ తమ్ముడు అల్లు శిరీష్ సైతం హీరోగా ఎంట్రీ ఇచ్చి సినిమాలు చేస్తున్నాడు. అయితే అల్లు అర్జున్‌కు వచ్చినంత క్రేజ్ శిరీష్‌కు రాలేదనే చెప్పాలి. 'గౌరవం' సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన అల్లు శిరీష్, కొత్తజంట, ఏబీసీడీ, క్షణం క్షణం , శ్రీరస్తు శుభమస్తు, ఊర్వశివో రాక్షసివో వంటి సినిమాల్లో నటించి మంచి గుర్తింపు దక్కించుకున్నారు. అయితే ఈ సినిమాలేవి కూడా అల్లు శిరీష్‌కు సరైన బ్రేక్ ఇవ్వలేకపోయాయి. దీంతో ఈసారి విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు ఈ అల్లు హీరో. అల్లు శిరీష్ హీరోగా తెరకెక్కిన చిత్రం బడ్డీ. ఈ సినిమా జూల్కె 26న విడుదల కాబోతోంది. టెడ్డీబేర్‌తో ఒక యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కింది. విడుదల తేదీ దగ్గరపడటంతో సినిమా ప్రమోషన్స్ స్పీడ్ పెంచారు. దీనిలో భాగంగానే అల్లు శిరీష్ అభిమానులతో సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా కొందరు మీరు కూడా మీ అన్న మాదిరగా సెపరేట్‌గా పీఆర్ టీమ్‌ని పెట్టుకొని ప్రేక్షకులకు దగ్గరవ్వచ్చుగా కదా అని అడిగారు. దీనికి అల్లు శిరీష్ సమాధానమిస్తూ ..వరసగా సినిమాలు చేస్తుంటే ఉంటే ప్రేక్షకులే మనల్ని గుర్తు పెట్టుకుంటారని వ్యాఖ్యానించారు. అంతేకాని ప్రత్యేకంగా సినిమాలను ప్రమోట్ చేయాల్సిన పని లేదంటూ అల్లు శిరీష్ కామెంట్స్ చేశాడు. మనం చేసిన సినిమాలే వారికి దగ్గర చేస్తాయి. ఈ విషయంలో ప్రభాస్ నుంచి మనం ఎంతో నేర్చుకోవాలి. సింప్లిసిటీకి పర్‌ఫెక్ట్ ఎగ్జాంపుల్ ప్రభాస్. ఆయన నటించిన సినిమా సంవత్సరానికి ఒక్కటైనా రిలీజ్ అవుతుంది. అయినా ఆయన బయట కనిపించేది చాలా తక్కువేనని అల్లు శిరీష్ చెప్పుకొచ్చాడు. ఆయన దగ్గర ఎలాంటి హంగు, ఆర్భాటం ఉండదని..తన సినిమాలను ప్రమోట్ చేసుకున్న సందర్భాలు కూడా చాలా తక్కువేనని అల్లు శిరీష్ తెలిపారు. తన సినిమాల ప్రమోషన్‌ని కూడా ఏదో నామమాత్రంగా చేసుకుంటారు అని తెలిపారు అల్లు శిరీష్. దీంతో అల్లు శిరీష్ చేసిన తన అన్న గురించే ఈ కామెంట్స్ చేశాడని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అల్లు శిరీష్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# ఇంత చేతగానివాళ్ళా... విజయ్ దేవరకొండపై మళ్లీ షాకింగ్ పోస్ట్ పెట్టిన అనసూయ!!



బుల్లితెరలో ప్రయాణం ప్రారంభించి వెండితెరలో వెలుగు వెలుగుతున్న అనసూయ భరద్వాజ్ ఏం చేసినా హాట్ టాపిక్ నే. మెయిన్‌గా ఎక్స్ ఖాతాలో అనసూయ పెట్టే పోస్టులు చాలా కాంట్రవర్సీలను క్రియేట్ చేస్తాయి. అనసూయ సెలెక్ట్ చేసుకునే క్యారెక్టర్స్,అనసూయ డ్రెస్సింగ్ స్టైల్, అనసూయ యాటిట్యూడ్ ప్రతి ఒక్కటి ఇండస్ట్రీలోనూ, జనాలలోను చర్చకు కారణంగా మారుతూనే ఉన్నాయి.

**మళ్ళీ అనసూయ వ్యాఖ్యల రగడ..** గతంలో తనను ఆంటీ అన్న వాళ్లపైన విరుచుకుపడిన అనసూయ లీగల్ యాక్షన్ తీసుకుంటానని షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇక ఈమధ్య యంగ్ హీరో విజయ్ దేవరకొండను కెలికిన అనసూయ మళ్లీ తాజాగా ఒక షాకింగ్ పోస్ట్ పెట్టి విజయ్ దేవరకొండ ను వార్తల్లోకి లాగింది. అనసూయ, విజయ్ దేవరకొండ విషయంలో తాజాగా ప్రెస్ మీట్ లో మీడియా అడిగిన ప్రశ్నలకు చేసిన వ్యాఖ్యలతో మరోమారు రచ్చ మొదలైంది. విజయ్ దేవరకొండ విషయంలో అనసూయ లేటెస్ట్ కామెంట్స్ సింబా సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో ఆమె నటించిన ఒక సీన్ పై మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పిన అనసూయ విజయ్ దేవరకొండకు తనకు మధ్య పెద్ద గొడవలు ఏమీ లేవని ,స్టేజ్ మ్యానర్స్ గురించే ఆ రోజు తాను మాట్లాడాల్సి వచ్చిందని, లైమ్ లైట్ లో ఉన్నప్పుడు పద్ధతిగా ఉండాలని చెప్పానని, అంతకుమించి ఎవరి మీద తనకు వ్యక్తిగతంగా ఎటువంటి గొడవలు లేవని పేర్కొన్నారు. తాజాగా షాకింగ్ పోస్ట్ పెట్టిన అనసూయ కానీ ఇక తాజాగా మరొకమారు అనసూయ భరద్వాజ్ చేసిన పోస్ట్ అందరిని ఒక్కసారిగా షాక్ కి గురిచేసింది. మరీ ఇంత చేతగాని వాళ్ళ లాగా ఉంటే ఎలా అండి.. నిజంగా మీకు కాలుతుంది అంటే నా మీద కాదు అస్తమానం నేనేం చేసినా ఆ టాపిక్ లాగే వారిని అనండి.. మీకు దమ్ముంటే అంటూ పోస్ట్ చేశారు. మీ హీరోలా ఆడవాళ్ళను దుర్భాషలాడటం మాత్రమే వచ్చు కానీ మీరు అలా చేయరు కదా ఎందుకంటే మీకు అది చేతకాదు.. మీ హీరో లాగా ఆడవాళ్లను ఉద్దేశించి దుర్భాషలాడటం మాత్రమే వచ్చు కదా పాపం.. మీరంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా.. శుభరాత్రి అంటూ అనసూయ భరద్వాజ్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఇక ఈ పోస్ట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.

# సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను సందర్శించిన.. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. సుధారాణి



**గుడివాడ,జూలై 25 (వార్తాప్రభ) :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాసంస్థ ఉత్తర్వుల ప్రకారం ఈనెల 25వ తేదీ (గురువారం) న గుడివాడ లోని 18వ వార్డు లోని కాకర్ల వీధి లోగల సోషల్ వెల్ఫేర్ హాస్టల్ (గర్ల్స్) ను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎం. సుధారాణి గారు విజిట్ చేయడం జరిగింది. ఇందులో భాగంగా ముఖ్యంగా భోజన వసతులు, టాయిలెట్లు, కాస్మొటిక్, హాస్పటల్ సదుపాయాలు విద్యార్థులను అడిగి తెలిసుకున్నారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం నుండి వచ్చిన ఆర్థిక వసతులు గురించి ఆరా తీసారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బి. అజయ్‌బాబు, చోరగుడి కుటుంబరావు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, పారాలీగల్ వాలంటీర్లు, హాస్టల్ వార్డెన్ ఏ. పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# వర్ణ విచక్షణపై తిరుగుబాటు చేసిన కవి గుర్రం జాషువా




**గుడివాడ,జూలై 25 (వార్తాప్రభ) :** సమాజంలోని వర్ణ విచక్షణ, వర్గ పోరాటాలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన కవి గుర్రం జాషువా అని లఘు చిత్రాల నిర్మాత దర్శకుడు రచయిత దుప్పల వెంకట రాజు పేర్కొన్నారు. కవి కోకిల, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 53 వ వర్ధంతి సభను పట్టణ సాహితి స్రవంతి బుధవారం రాత్రి నిర్వహించింది. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ జీవితాంతం వర్ణ విచక్షణ కు గురైనా రచనా సామర్థ్యంతో అగ్ర వర్ణానికి చెందిన కవులకు ధీటుగా నిలిచి వారి చేతనే సత్కారాలు పొందారని కొనియాడారు.. విశ్రాంత చరిత్ర అధ్యాపకులు కోగంటి గాంధీ బాబు, సాహితీ మిత్రులు కన్వీనర్ వసుధ బసవేశ్వర రావు, ఉపాధ్యాయులు శ్రీ కుమార్, ఫ్రాన్సిస్, బి.శ్రీనివాస్, ఆవిర్నేని వెంకటేశ్వరావు, యలవర్తి కోటేశ్వర రావు తదితరులు మాట్లాడుతూ జాషువా రచనల్లోని వివిధ పార్శ్వాలను స్పృశించారు. సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, అధ్యక్షులు సురేంద్ర, చోడవరపు రూప మరియు పెక్కు మంది సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్‌ను కలిసిన ఐఓసీ డైరెక్టర్ - కార్యకలాపాల విస్తరణపై చర్చ



**అమరావతి,జూలై 25 (వార్తాప్రభ) :** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్?ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) డైరెక్టర్ (మార్కెటింగ్) వి సతీష్ కుమార్ కలిశారు. అసెంబ్లీలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఐఓసీ ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఐఓసీ కార్యకలాపాలు, ఐఓసీ విస్తరణకు సంబంధించిన అంశాలను డిప్యూటీ సీఎంకు వివరించారు. తమ సంస్థ కార్యకలాపాలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు పవన్?కు వివరించారు. రాష్ట్రంలో సంస్థ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ బీ అనిల్ కుమార్ కూడా పాల్గొన్నారు.

# ఘనంగా నవరస నట సార్వభౌముడు కైకాల జయంతి వేడుకలు

● కైకాల సత్యనారాయణ కు పద్మశ్రీ ప్రకటించాలన్న కాపు సేవా సమితి పెద్దలు..



**గుడివాడ,జూలై 25 (వార్తాప్రభ) :** కాపు సేవా సమితి ఆధ్వర్యంలో స్వర్గీయ కైకాల సత్యనారాయణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఓల్డ్ మున్సిపల్ కార్యాలయ సెంటర్లోని కైకాల విగ్రహానికి సేవా సమితి పెద్దలు మరియు అభిమానులు, కళాకారులు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోహార్ కైకాల అంటూ నినాదాలు చేసిన అభిమానులు.. కైకాలకు పద్మశ్రీ ఇచ్చి గౌరవించాలంటూ ముక్తకంఠంతో నినదించారు. అనంతరం సేవా సమితి పెద్దలు కైకాల జయంతి కేక్ కట్ చేశారు.. కళా రంగంలో తిరుగులేని పాత్రలకు జీవం పోసిన కైకాల.. ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందారని.. అంతటి మహానుభావుడు మన ప్రాంత అంతటి మహానుభావుడు మన ప్రాంతవాసి కావడం గుడివాడ ప్రజలకు గర్వకారణమని కాపు సేవా సమితి పెద్దలు అన్నారు. గుడివాడలో కైకాల కళామందిర్ ను అభివృద్ధి చేసి.. మహనీయుడు కైకాల సేవలను ప్రజలందరికీ చేరువ చేయాలని కళాకారుల సంఘ పెద్దలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సినీ, కళా రంగానికి చిరస్మరణీయమైన సేవలు అందించిన కైకాలకు పద్మశ్రీ ఇవ్వాలని అభిమానులు, సేవా సమితి పెద్దలు ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కైకాల జయంతి వేడుకల్లో కాపు సేవా సమితి అధ్యక్షుడు నరహరిశెట్టి ప్రసాద్, వ్యవస్థాపకులు పొన్నూరు రామకృష్ణ, కాపు సంఘ పెద్దలు పాలేటి చంటి, గోకర కొండ బలరాం, ఆడబాల అప్పారావు, ఆళ్ల చెన్నకేశవరావు, పంచకర్ల వెంకట్, వంగా వంశీ, కళాకారుల సంఘ పెద్దలు నెరుసు చింతయ్య, కొడాలి రాజా, కైకాల అభిమానులు అల్లాడ శ్రీనివాస్, ఆర్.కె., అద్దేపల్లి పురుషోత్తం, యర్రపోతు అర్జున్, సాయన రాజేష్, సందు పవన్, రాజనాల సాయి, మోహన్.. పెద్ద సంఖ్యలో అభిమానులు, కాపు సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గంగానమ్మ వారి దేవస్థానంలో శాఖంబరి ఉత్సవాలు..

● శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు



**గుడివాడ,జూలై 25 (వార్తాప్రభ) :** స్థానిక మేదర్ బజార్ గంగానమ్మ వారి వీధిలోని శ్రీ గంగానమ్మ వారి దేవస్థానంలో శాఖంబరి ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. కాయగూరలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లతో శ్రీ శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారికి.. వేద పండితులు భాను కిరణ్ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో ఉత్సవ పిటలపై భక్తులు ఇంటి రాము.. శ్రీదేవి దంపతులు కూర్చొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఏటా దేవస్థానంలో శాకాంబరి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని భక్తులు ఇంటి రాము తెలియజేశారు. వేడుకల్లో భక్తులు రమేష్,లక్ష్మీ,తదితర పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీల లెక్కింపు



**గుడివాడ,జూలై 25 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు మండలం. వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. యాత్రికులు సమర్పించిన కానుకల హుండీలను లెక్కించగా 60 రోజులకు గాను నోట్లు ద్వారా రూ. 25,91,890-00, చిల్లర ద్వారా రూ. 1,28,041-00 వెరసి మొత్తము రూ.27,19,931-00 లు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో మచిలీపట్నం తనిఖీ అధికారి కె. శ్రీనివాసరావు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు, గ్రామ సర్పంచ్ మన్నెం పద్మావతి, టిడిపి పార్టీ అధ్యక్షుడు బి. అంకాలరావు, ఎం నరసింహమూర్తి, గుడ్లవల్లేరు పోలీస్ సిబ్బంది, ఇండియన్ బ్యాంకు సిబ్బంది , సేవా సమితి వారు, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'ఉద్యోగాలిప్పించే బాధ్యత తీసుకున్నావా అన్న' - అసెంబ్లీ లాబీలో లోకేశ్



**గుడివాడ,జూలై 25 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్? అసెంబ్లీ సమావేశాల్లో అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయి. అంతే కాకుండా లాబీలలో కూడా రాష్ట్ర భవిష్యత్తు, యువత గురించే మాట్లాడుకుంటున్నారు. తాజాగా యువతకు ఉద్యోగాల కల్పనపై లాబీలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో నారా లోకేశ్ చర్చించారు. అసెంబ్లీ లాబీలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో యువతకు ఉద్యోగాల కల్పనపై మంత్రి నారా లోకేశ్ చర్చించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకున్నావా అని రాముతో లోకేశ్ అన్నారు. అమెరికాలో ఉన్న సాఫ్ట్‌వేర్ సంస్థల ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వామి కావాలని సూచించారు. ఇప్పటికే తనవంతు పని ప్రారంభించానని, ప్రభుత్వ లక్ష్యం తప్పక నెరవేరుతుందని వెనిగండ్ల రాము స్పష్టం చేశారు.

# నేర రహిత రాష్ట్రమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

అన్నారు.

**పల్నాడు పులి కోడెలను వేధించి ప్రాణాలు తీశారు..** "పల్నాడు పులిగా పిలుచుకునే కోడెల శివప్రసాదరావుపై 18 కేసులు పెట్టి వేధించారు. ప్రభుత్వ ఫర్నిచర్ తిరిగి ఇవ్వలేదని కేసులు పెట్టారు. ఈ మాజీ సీఎంను నేను అడుగుతున్నా....నీ ఇంట్లో ఇప్పుడు కూడా ప్రభుత్వ ఫర్నిచర్ ఉంది కదా...దానికి ఏం సమాధానం చెప్తావు.? కనీస సంప్రదాయం పాటించకుండా కేసులుపై కేసుల పెట్టి వేధించడంవల్ల అవమానంతో కోడెల ఆత్మహత్య చేసుకున్నారు. దళిత మహిళ అత్యాచారానికి గురై హత్యగావించబడితే వంగలపూడి అనిత, ఎంఎస్ రాజు పులివెందుల వెళ్లి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తే వారిపైనా అట్రాసిటీ కేసు పెట్టారు. అయ్యన్నపాత్రుడుపైనా రేప్ కేసు పెట్టారు. అక్రమ మైనింగ్ పై ప్రశ్నించినందుకు దేవినేని ఉమాపై కేసులు పెట్టారు. రామతీర్థంలో రాముడి తల తీశారు... దాన్ని ప్రశ్నించినందుకు అశోక్ గజపతిరాజుపై కేసులు పెట్టారు. పైల్స్ ఆపరేషన్ చేయించుకున్న అచ్చెన్నాయుడుని 600 కి.మీ తిప్పి జైల్లో పెట్టారు. ప్రశ్నాపత్రం లీక్ అంటూ అపోహలు సృష్టించి మంత్రి నారాయణపైనా కేసులు పెట్టి వేధించారు. రఘురామకృష్ణరాజును అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు. లాకప్ లో దారుణంగా కొట్టి, ఆ వీడియోలు చూసి పైశాచిక ఆనందం పొందారు. ఒక ఎంపీని ఐదేళ్ల పాటు నియోజకవర్గానికి వెళ్లకుండా చేశారు. పీఎం పాల్గొనే సభకు రైలులో వెళ్తుంటే రఘురామకృష్ణరాజు ప్రయాణించే భోగీని కూడా పెట్రోలు పోసి తగలబెట్టాలని చూశారు. పట్టాభి కాళ్లపై కొట్టారు, మాచర్లలో జూలకంటి బ్రహ్మారెడ్డి ఇంటిపై దాడి చేసి ఇల్లు తగలబెట్టి ఆయనపైనే కేసులు పెట్టారు. నా ఇంటిపైకి దాడి చేయడానికి జోగి రమేష్ వచ్చాడు. పార్టీ శ్రేణులు ప్రశ్నిస్తే నా ఇంటికి అపాయింట్మెంట్ కోసం వచ్చానని చెప్పాడు. పుంగనూరుకు చెందిన రామచంద్రయాదవ్ ఇంటిపై పెద్దిరెడ్డి మనుషులు దాడి చేసి విధ్వంసం సృష్టించి ఆయన కార్లు అన్నీ పగలగొట్టారు. విజయవాడలో టీడీపీ నేత గాంధీపై దాడి చేసి కన్ను పోగొట్టారు. అమరావతిలో నాపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు...ప్రజాస్వామ్య దేశంలో భావప్రకటన స్వేచ్ఛ హక్కు ప్రకారం నిరసన తెలిపే హక్కు ఉందని నాటి డీజీపీ గౌతమ్ సవాంగ్ అన్నారు. మంగళగిరి, గన్నవరం టీడీపీ కార్యాలయాలపైన, టెక్కలిలో జనసేన కార్యాలయంపైనా దాడి చేశారు. పార్టీ కార్యాలయాలపై దాడులు చేసే సంస్కృతికి గత ఐదేళ్లలో శ్రీకారం చుట్టారు." అని సీఎం అన్నారు.

**టీడీపీ కార్యకర్తలను ఊచకోత కోశారు..** "తోట చంద్రయ్యను పట్టపగలే అందరూ చూస్తుండగానే పీక కోసి చంపారు. జై జగన్ అంటే వదిలేస్తామని చెప్తే జై చంద్రబాబు, జై తెలుగుదేశం అని ప్రాణాలు వదిలాడు తప్ప రాజీపడలేదు. కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్యను నరికి చంపారు. పల్నాడులో వెంకటలక్ష్మీ, శేషగిరిరావు, మాణిక్యం అనే వ్యక్తులపై మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి దాడులు చేశారు. వినుకొండలో వాళ్ల పార్టీకి సంబంధించిన ఇద్దరు కార్యకర్తలు గంజాయి మత్తులో కొట్టుకుని చనిపోయారని వాళ్ల మాజీ ఎమ్మెల్యేనే చెప్పారు. కానీ దానిపై జగన్ ఢిల్లీ వెళ్లి ధర్నాలు చేశారు. టీడీపీ కార్యకర్తలను అంతమందిని హత్య చేస్తే ఏనాడైనా సమీక్ష చేసిన సందర్భాలు ఉన్నాయా.? శాంతి భద్రతలు కాపాడటం మా ప్రభుత్వ బాధ్యత." అని సీఎం హామీ ఇచ్చారు.

**టీడీపీ, జనసేన, బీజేపీ నేతలపై తప్పుడు కేసులు..** "నాడు మేం ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మా కార్యకలాపాలను అణచివేయడానికి జీవో-1 తీసుకొచ్చారు. ఇంట్లో నుండి బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారు. టీడీపీ నేతలపై 591 కేసులు పెట్టి 162 మంది నేతలను అరెస్టు చేశారు. 1,969 కేసులను పార్టీ శ్రేణులపై పెట్టి 2,370 మంది శ్రేణులను అరెస్ట్ చేశారు. పార్టీ నేతలు, శ్రేణులపై 2560 కేసులు పెట్టారు. జనసేన నేతలపై 24 కేసులు, పార్టీ శ్రేణులపై 181 కేసులు పెట్టి 71 మందిని అరెస్టు చేశారు. బీజేపీకి చెందిన 16 మంది నేతలపై కేసులు, శ్రేణులపై 57 కేసులు పెట్టి 31 మందిని అరెస్టు చేశారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, అన్ని పార్టీల వారిపై కేసులు పెట్టారు." అని సీఎం వివరించారు.

**టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు...వేధింపులు..**

"టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డిపై అత్యధికంగా 66 కేసులు పెట్టి 46 సార్లు అరెస్టు చేశారు. చింతమనేని ప్రభాకర్ పై 45 కేసులు పెట్టి 15 సార్లు అరెస్టు చేశారు. పులివర్తి నానిపై కేసులు పెట్టి జైల్లో పెట్టారు. ఇలా సుమారు 53 మంది నేతలపై అక్రమంగా కేసులు పెట్టి వేధించారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188